

ప్రజాస్వామ్యం ఖూ(తు)నీ!



ఉద్రిక్తత : తుని బాలాజీ కాంప్లెక్స్ వద్ద బారికేడ్లను తోసుకొస్తున్న కార్యకర్తలపై లాఠీచార్జి

తునిలో వైసీపీ అరాచకీయం

ఓటమి పాలైనా వైసీపీ నాయకులు మారలేదు.. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సుమారు 17 మంది కౌన్సిలర్లను బంధించి గత రెండు రోజులుగా స్వేచ్ఛను హరిస్తున్నారు.. మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చినా భేఖాతర్ చేస్తున్నారు.. ఎన్నికలు జరిగే మునిసిపల్ కార్యాలయాన్ని ఆనుకుని ఎడమ వైపున ఉన్న చైర్మన్ నివాసంలో వైసీపీ కౌన్సిలర్లను బంధించారు. కళ్లెదుటే కౌన్సిలర్లు ఉన్నా వేలాదిగా ఉన్న పోలీసులు.. అధికారం చేతిలో ఉన్న కూటమి నాయకులు వారు ఎప్పుడొస్తారోనని ఎదురుచూడడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. తునిలో కళ్లెదుటే వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు..

- మళ్లీ వైసీపీ నేతల డ్రామాలు
- హాజరైన టీడీపీ కౌన్సిలర్లు
- వైసీపీ కౌన్సిలర్ల నిర్బంధం
- బయటకొచ్చిన కౌన్సిలర్లు
- లాక్కుపోయిన రాజా
- కోరం లేక మళ్లీ వాయిదా
- నాలుగోసారి అంతే
- తేలని వైస్ చైర్మన్ ఎన్నిక
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- చలో తునికి వైసీపీ నేతలు
- అడ్డుకున్న పోలీసులు

కాకినాడ/ తుని రూరల్ (ఆంధ్రజ్యోతి) :

మళ్లీ అదే సీను.. అదే డ్రామా.. ఎన్నికకు హాజరైతే ఓడిపోతామనే భయంతో అవే కుయుక్తులు.. కౌన్సిలర్ల నిర్బంధాలు.. అడుగు పెట్టనీయకుండా వారిపై ఆంక్షలు.. చివరకు మళ్లీ నాలుగోసారీ వాయిదా.. వైసీపీ డ్రామాలతో తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఎటూ తేలకుండా సా..గుతోంది. చివరకు మంగళవారమైనా ఉత్కంఠకు తెరపడుతుందని భావిస్తే మళ్లీ సేమ్.. వైసీపీ తీరుతో కోరం లేని కారణంగా వాయిదా.. దీంతో తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఎప్పటికి పూర్తవుతుందోనన్న ఆందోళన.. చలో తునికి అనుమతి లేకపోయినా పలువురు వైసీపీ నేతలు ఇంకో డ్రామాకు తెరలేపగా పోలీసులు అడ్డుకుని వెనక్కు పంపారు.

మళ్లీ అదే రిపీటు..

తుని మునిసిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక రోజు రోజుకు ఉత్కంఠభరితంగా మారుతోంది. కోరం లేక సోమవారం ఎన్నిక రద్దవగా, తిరిగి మంగళవారం కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది. వాస్తవానికి తునిలో ఖాళీ అయిన వైస్ చైర్మన్ ఎన్నికకు ఈనెల 3న నోటిఫికేషన్ జారీ అయింది. వైసీపీ డ్రామాల కారణంగా ఈనెల 3,4 తేదీల్లో జరగాల్సిన ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. తాజాగా కోర్టు ఆదేశాలతో సోమవారం ఎన్నికకు వీలుగా అధికారులు కౌన్సిలర్లను ఆహ్వానించారు. టీడీపీ నుంచి పది మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాగా వైసీపీ కౌన్సి లర్లు 17 మందిని ఆ పార్టీ నిర్బంధించి ఓటింగ్‌కు రాకుండా చేసింది. కోరం లేకపోవడంతో ఎన్నికను రద్దు చేసి మంగళవారం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.దీంతో మంగళవారం ఉదయం 11 గంటలకు టీడీపీ కౌన్సిలర్లు 10 మంది ఎన్నికకు హాజరయ్యారు. వైసీపీ కౌన్సిలర్లు వస్తారని అంతా భావించారు. కానీ వైసీపీ తన డ్రామాను మళ్లీ కొనసాగించింది. ఉదయం 8 గంటలకే తమ కౌన్సిలర్లను వైసీపీ మునిసిపల్ చైర్మన్ నివాసానికి తరలించింది. కాసేపటికే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అక్కడకు చేరుకుని ఎన్నికకు వెళ్లొద్దంటూ బెదిరించారు. మరో పక్క ఉదయం 10 గంటలు అవగానే తుని టీడీపీ కార్యకర్తలు,నాయకులు మునిసిపాలిటీ వద్దకు చేరుకున్నారు. వీరిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. కొందరు వైసీపీ కౌన్సిలర్లను దాచిపెట్టిన చోటు వైపు వెళ్లే ప్రయత్నం చేయగా పదుల సంఖ్యలో పోలీసులు మోహరించి బారికేడ్లు అడ్డంపెట్టేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. సరిగ్గా ఉదయం 10:30 గంటలకు టీడీపీ కౌన్సిలర్లు పది మంది మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వీరి ధ్రువీకరణ పత్రాలను సరిచూసి అధికారులు 11 గంటలకు లోపలకు పంపారు. కానీ వైసీపీ కౌన్సిలర్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల వలయాన్ని చేదించుకుని వైసీపీ కౌన్సిలర్లు ఉన్న ప్రాంతం వైపు చొచ్చుకు వెళ్లడానికి పరుగులు తీశారు. వైసీపీ కౌన్సిలర్లను నిర్బంధించిన దాడిశెట్టి రాజా, చైర్‌పర్సన్ ఉన్న వైపు టీడీపీ శ్రేణులు దూసుకువెళ్లే ప్రయత్నం చేశాయి. ఎన్నికకు కౌన్సిలర్లను పంపాలని వైసీపీని నిలదీసేందుకు టీడీపీ నేతలు పలుసార్లు ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. అదే సమయంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ శ్రేణుల వైపు దూసుకురావడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఘర్షణ నెలకొనడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.



మేము ఇక్కడే ఉన్నాం : చైర్‌పర్సన్ నివాసం నుంచి బయటకొచ్చిన వైసీపీ కౌన్సిలర్లు

ఇలా రాగానే.. అలా లాక్కుపోయారు..!

ఎన్నిక మరికాసేపట్లో ప్రారంభం కానుండగా వైసీపీ కౌన్సిలర్లు కొందరు నిర్బంధం నుంచి బయటకొచ్చి సమావేశానికి వచ్చే ప్రయత్నం చేశారు. టీడీపీ నేతలు వారి వైపు దూసుకెళ్లారు. గమనించిన దాడిశెట్టి రాజా, చైర్‌పర్సన్ వారిని తమ మనుషులతో లోపలకు లాక్కుపోయారు. సమయం 12 గంటలు దాటిపోయినా వైసీపీ కౌన్సిలర్లు రాకపోవడంతో కోరం లేక ఎన్నిక వాయిదా వేశారు.



మేము వచ్చేశాం : హాజరైన టీడీపీ కౌన్సిలర్లు

ఇక ఈసీ నిర్ణయమే..

మళ్లీ ఎప్పుడు ఎన్నిక జరుగుతుందనేది ఈసీ నిర్ణయిస్తుందని అధికారులు వివరించారు. ఇప్పటికే ఎన్నిక నాలుగుసార్లు వాయిదా పడడంతో ఈ విషయాన్ని కలెక్టర్ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో రెండుసార్లు కోరం లేక వాయిదాపడినందున తదుపరి నిర్వహించే ఎన్నిక కోరంతో సంబంధం లేకుండా నిర్వహించొచ్చా? లేదా?అనే దానిపై ఈసీ త్వరలో నిర్ణయించే అవకాశం ఉంది.



అనుమతి లేదన్నా వచ్చేసి : నేలపై బైఠాయించి ద్వారంపూడి, కన్నబాబు, ఇతర వైసీపీ నాయకుల నిరసన

చలో తుని.. మరో డ్రామా..

ఒక పక్క ఎన్నిక జరగకుండా అడ్డుకుంటున్న వైసీపీ.. మంగళవారం చలో తునికి రావాలంటూ దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. పోలీసులు చలో తునికి అనుమతి లేదని తెగేసి చెప్పారు. తొలుత కిర్లంపూడి నుంచి ముద్రగడ పద్మనాభరెడ్డి తునికి బయలుదేరగా తుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో పోలీసులు అడ్డుకోగా వెనుదిరిగి వెళ్లిపోయారు. అటు మాజీ ఎంపీ వంగా గీత తునిలో హల్‌చల్ చేశారు. అనుమతి లేదని చెప్పినా రాజా వద్దకు వెళ్లి కౌన్సిలర్లతో మాట్లాడారు. కాకినాడ నుంచి మాజీ మంత్రి కన్నబాబు, ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు తునికి వెళ్లే ప్రయత్నం చేయగా గొల్లప్రోలు హైవేపై పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా తుని వచ్చిన మాజీ ఎంపీ వంగా గీతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తునిలో గొడవలు జరిగే అవకాశం ఉండడంతో నియోజకవర్గంలో మాజీ మంత్రి దాడిశెట్టితోపాటు పలువురు నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.



సత్తుపాటి ప్రసన్నశ్రీ



చేకూరి శివరామకృష్ణ ప్రసాద్

రెండు వర్సిటీలకు వీసీల నియామకం

కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యావ్యవస్థను గాడిలో పెట్టే చర్యలకు దిగింది.. ఎట్టకేలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండు యూనివర్సిటీలకు మంగళవారం వీసీ (వైస్ చాన్సలర్ల) నియామకం చేపట్టింది..

కాకినాడలో ఉన్న జేఎన్‌టీయూకే వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ జిల్లా వరంగల్ నిట్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు.. గుంటూరు జిల్లాకు చెందినవారు. ఇక తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఉన్న నన్నయ వర్సిటీ వీసీగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం విశాఖపట్నం ఏయూలో ఆంగ్ల విభాగ ప్రొఫెసర్‌గా ఉన్నారు.. 19 గిరిజన భాషలకు లిపి రూపొందించింది 2022లో అప్పటి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారం అందుకున్నారు. వీరిద్దరూ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. - వివరాలు 6లో

రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు

- మీ సేవా కేంద్రం చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- సాఫ్ట్‌వేర్ సమస్యతో జాప్యం
- ప్రభుత్వం ఎప్పటికి మోక్షం ఇచ్చేనో..
- అన్ని పథకాలకు ఇదే ఆధారం

సామర్లకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కొత్త రేషన్‌కార్డుల మంజూరు కోసం ఐదేళ్లపాటు కళ్లుకాయలు కాచేలా అర్హులైన కుటుంబాలు ఎదురుచూశారు. ప్రభుత్వం మారి ఆ స్థానంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం కొత్తకార్డులు మంజూరు చేస్తుందన్న ఆశలు ప్రజల్లో చిగురించాయి. ఇందుకు సంబంధించి డిసెంబరు నెలలో కొత్తకార్డులంటూ ప్రభుత్వం ప్రకటన చేసినట్టు ఒక ప్రకటన జారీ అయ్యింది. ఈ మేరకు గత ఏడాది డిసెంబరు నెల 2వ తేదీ నుంచి అన్ని సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారంటూ ప్రకటన చేశారు. కొత్త సంవత్సరంలో సంక్రాంతికి కొత్తకార్డులంటూ ఊరించారు. దీంతో డిసెంబరు నెలంతా జనం ఎదురు చూశారు. జనవరి పూర్తయ్యింది, ఫిబ్రవరి నెల రెండు వారాలు ముగిశాయి. కూటమి కానీ ప్రభుత్వం కొత్తకార్డుల విషయమై ఎటువంటి ప్రక్రియ ప్రారంభించలేదు. దీంతో ప్రజల్లో నిరాశానిస్పృహలు నెలకొన్నాయి. అయినా ఆశ చావక కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ ప్రక్రియ సక్రమంగా సాగలేదు. దరఖాస్తులను చేసుకున్న ఆరు నెలల తర్వాత కొత్తకార్డులు ఇస్తామని చెప్తూ కాలయాపన చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్ కార్డులు లేని ప్రజల ఆశలు చిగురించాయి. అందుకు అనుగుణంగా నూతన సంవత్సరం కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీతోపాటు చేర్పులు, మార్పులకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాఫ్ట్‌వేర్‌లో ఉత్పన్నమైన కొన్ని సమస్యలతో ఆ ప్రక్రియ చేపట్టడంలో జాప్యమవుతోంది. విషయం తెలియని ప్రజలు రేషన్‌కార్డుల కోసం మీసేవా కేంద్రాలకు తిరుగుతున్నారు. వాటి నిర్వాహకులు ఇంకా సైట్ ఓపెన్ కావడం లేదని చెబుతుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి ఉంది. ఇక ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుండడంతో కొత్తవి కోరుతూ మండల, జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం లేకపోవడంతో ఇప్పుడు అందుకోసం అనేక మంది అటు తహశీల్దార్, ఇటు పౌరసరఫరాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబంలో ఒకరు చనిపోయి ఉంటే వారి తొలగింపు, పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుంబంలో ఐదారుగురు గతంలో కలిసి ఉండి ఇప్పుడు విడిపోయి ఉంటే అటువంటి వారు కొత్త కార్డుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌరసరఫరాల ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్ కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీల విషయాన్ని జిల్లా అధికారులు వారి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఆ విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని, త్వరలోనే ప్రకటన వస్తుందని ఉన్నతాధికారులు చెప్పినట్టు సమాచారం.

మార్గదర్శకాలు ఎప్పుడో..

కాకినాడ జిల్లాలో 16.20 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులున్నాయి. మరో 3.30 లక్షల వరకూ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఇప్పటికే నమోదు చేసుకున్న దరఖాస్తుదారులు కోరుతున్నారు. అయితే ఇందుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కించడం పట్ల పలువురు ఆందోళన చెందుతున్నారు. రానున్న కాలంలో కూటమి ప్రభుత్వం అమలుచేసే ఇంటి స్థలం, ఇంటి నిర్మాణ రుణం, పింఛన్లు, ప్రభుత్వ రుణాలు తదితర వ్యక్తిగత లబ్ధిపొందే ప్రతీ పథకానికీ రేషన్‌కార్డు కీలకం అయినందున త్వరితగతిన కొత్తరేషన్‌కార్డులు మంజూరుచేయాలని పలువురు దరఖాస్తుదారులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల మార్గదర్శకాలు త్వరితగతిన విడుదల చేయాల్సి ఉంది.



గాంధీనగర్ రైతు బజార్‌లో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ సుధాకర్

'రైతుబజార్లలో మెరుగైన సౌకర్యాలు'

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పంట పండించే రైతు నష్టపోకుండా రైతుబజారులో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అగ్రికల్చర్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ ఎస్టేట్ ఆఫీసర్‌కు సూచించారు. మంగళవారం కాకినాడ గాంధీనగర్ రైతుబజారును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నేరుగా పొలంలో పండించిన పంటలు రైతుబజార్లలో అమ్ముకునే రైతులకు సహకరించాలని, తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్ మోహన్, ఏడీ రాఘవేంద్రరావు తదితరులు ఉన్నారు.

సోలార్ ప్యానళ్ల ఏర్పాటు వేగవంతం

ప్రజలకు అవగాహన కల్పించాలి : సమీక్షలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటి మీద సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో పీఎం సూర్య ఘర్ ప్యానల్ ఏర్పాటు పురోగతి, పీఎం కుసుమ్ యోజన కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన భూముల గుర్తింపు వంటి అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ ప్యానల్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు పీఎం సూర్యఘర్ పథకం కింద 671 మంది తమ గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. విద్యుత్తు వాడకాన్ని తగ్గించి, ప్రకృతి సహజసిద్ధంగా లభించే సోలార్ విద్యుత్ వినియోగం, ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీపై జిల్లాలో విస్తృత అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో ప్రజలు సోలార్ ప్యానల్ తమ గృహాలపై ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. అలాగే వ్యవసాయంలో సౌరశక్తిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై సౌరపంపులు, పునరుత్పాదన ఇంధన ఆధారిత విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుచేయడానికి జిల్లాలో అనువైన భూములను గుర్తించాలన్నారు. ఈ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి జిల్లాలో పోలవరం లెఫ్ట్ కెనాల్ ఆనుకుని ఖాళీగా ఉన్న ప్రదేశాలను సర్వే చేసి నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రసాద్, పోలవరం ఎస్ఈ ఏసుబాబు, డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ జగ్గంపేట, పెద్దాపురం ఈఈలు వీరభద్రరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఓటు వేసే విధంగా అనుమతి ఇవ్వాలి

ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌ను కోరిన జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ) ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న పట్టభద్రులు ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు. ఆరోజు ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌లు పట్టభద్రులు ఓటు వేసేవిధంగా ఆలస్యంగా విధులకు హాజరుకావడానికి అనుమతి ఇవ్వాలని ఆదేశించారు.

సెక్టోరల్ అధికారుల నియామకం

ఈనెల 27వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి జిల్లాలో 20మంది సెక్టోరల్ అధికారులను నియమించారు. వీరికి మెజిస్ట్రీరియల్ అధికారాలిస్తూ ప్రభుత్వ న్యాయ విభాగం ఆదేశాలు ఇచ్చింది.

సాదాసీదాగా జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

కోరం లేక గంట ఆలస్యంగా ప్రారంభం

7

ఆ కాలనీల్లో.. ఉన్నదెవరు..

- ఇళ్ల పట్టాల అర్హతపై పునః పరిశీలన
- 21 మండలాల్లో తహశీల్దార్లు, కమిషనర్ల ఆధ్వర్యంలో తనిఖీలు
- గత అయిదు రోజులుగా తనిఖీలు
- ముప్పై శాతం వరకు పూర్తయిన పునఃపరిశీలన
- మరో వారం రోజుల్లో ముగియనున్న ప్రక్రియ
- అనర్హుల పట్టాలు రద్దు అయ్యే అవకాశం

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 18(ఆంధ్రప్రదేశ్): జిల్లాలో గత ప్రభుత్వం హయాంలో నవరత్నాలు పథకాల్లో భాగంగా పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలపై క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేస్తున్నారు. గత ఐదు రోజుల నుంచి పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో, గ్రామీణ మండలాల్లో తహశీల్దార్ల సమక్షంలో పట్టాలపై దర్యాప్తు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అర్హతను పరిశీలించకుండా వైసీపీ నాయకులు సిఫార్సు చేయగానే ఇష్టారాజ్యంగా ఇళ్ల పట్టాలు పంపిణీచేశారనే ఆరోపణలు ఉన్నాయి. సొంత ఇళ్లు ఉన్న లబ్ధిదారులకు నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నవారికి ప్రభుత్వ ఉద్యోగులు పట్టాలు పొందినట్టు విమర్శలు వచ్చాయి. అలాగే పది ఎకరాల పొలం ఉన్న బడా రైతులకూ పట్టాలు ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పునః పరిశీలనతో అనర్హుల గుండెలలో రైళ్లు పరిగెడుతున్నాయి. తమ పట్టాలు ఎక్కడ రద్దు అవుతాయోననే భయం నెలకొంది. కాకినాడ జిల్లాలో 300 లేఅవుట్లలో 1.69 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరుచేశారు. దీనిలో 1.30 లక్షల మందికి కన్వేయన్స్ డీడ్ రూపంలో పట్టాలు రిజిస్ట్రేషన్ చేశారు. ఇంకా 39 వేల మందికి కాలేదు. జిల్లాలో దాదాపు 25శాతం మంది పట్టాలు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఇళ్ల పట్టాల సంబంధిత లబ్ధిదారుల వద్ద ఉన్నాయా లేదా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. అధికారులు ప్రధానంగా 17 అంశాలను పరిశీలిస్తున్నారు. ఇళ్ల స్థలం పొందిన లబ్ధిదారుడు బీపీఎల్ కేటగిరీకి చెందినవారా కాదా అనేది పరిశీలిస్తున్నారు. అలాగే గతంలో ఇల్లు కలిగి ఉన్నారా, వాటికి సంబంధించిన ఇంటిపన్ను రశీదులు తనిఖీ చేస్తున్నారు. పది ఎకరాల పొలం, నాలుగుచక్రాల వాహనం, ప్రభుత్వ ఉద్యోగం, ఎలక్ట్రిసిటీ బిల్లులు, పర్మినెంట్ మైగ్రేషన్, డెత్ వివరాలు, ఒకే కుటుంబంలో రెండు ఇళ్ల పట్టాలు పొంది ఉంటే వాటిని విచారణ చేస్తున్నారు. పెళ్లి కానివారు, మైనర్లు ఇళ్ల స్థలాలు పొందారా అనే కోణంలో విచారణ సాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో 30 శాతం వరకు పునః పరిశీలన పూర్తి అయ్యింది. మరోవారం రోజుల్లో పునః పరిశీలన పూర్తిచేసి అనర్హుల జాబితా నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు. అనంతరం అనర్హుల ఇళ్ల పట్టాను ప్రభుత్వం రద్దు చేయనుంది. గత ప్రభుత్వంలో నిషిద్ధ జాబితా (22ఏ) నుంచి కాకినాడ జిల్లాలో 80 వేల ఎకరాల వరకు అసైన్డ్ భూములను తప్పించారు. యాజమాన్య హక్కుల పేరుతో ఆ భూముల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. దీనిలో 130 ఎకరాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. దీనిపైన కూడా ప్రభుత్వ అధికారులు సర్వే చేస్తున్నారు. గతంలో పొందని అర్హులైన పేదలకు పట్టాలు ఇవ్వనుంది.

అధికారులంతా జగనన్న కాలనీలో..

గత ఐదురోజుల నుంచి తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, సర్వేయర్లు, కమిషనర్లు జగనన్న కాలనీలోనే పాగా వేశారు. తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు.

భూముల కొనుగోళ్లలో గోల్‌మాల్

ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు భూములను సేకరించే నిమిత్తం వైసీపీ నేతలు తక్కువ ధరలకు భూములను కొని ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికార యంత్రాంగం కొమరిగిరి లేఅవుట్‌తోపాటు జిల్లాలో ఉన్న ఇతర లేఅవుట్‌లను పరిశీలించింది. వాస్తవంగా ఆయా భూముల మార్కెట్ విలువ ఉంది, ఎంతకు కొనుగోలుచేసి ప్రభుత్వానికి విక్రయించారు, దీని వల్ల ప్రభుత్వ సొమ్ము ఏమేరకు దుర్వినియోగం అయిందనే వివరాలను నమోదు చేసుకున్నారు. దీనిలో వైసీపీ నేతల పాత్ర, జరిగిన అవకతవకలను గుర్తించారు. ఈమేరకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీంతో భూములు తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు విక్రయించిన వైసీపీ నేతలపై కూడా చర్యలు తీసుకొనే అవకాశం ఉంది.

అనర్హులను గుర్తిస్తున్నాం: డీఆర్వో

గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలపై దర్యాప్తు జరుగుతోందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు చెప్పారు. అనర్హులను గుర్తించే ప్రక్రియ సాగుతోంది. అనర్హుల జాబితా సిద్ధమయ్యాక ప్రభుత్వానికి పంపుతామన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా..

- కాకినాడలో కొనసాగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్
- పర్యాటక ప్రాంతాలను సందర్శించిన క్రీడాకారులు

6

క్రీడలపై ఆసక్తితోనే సహాయం చేస్తున్నా

● ఎంవీఎస్ సత్యనారాయణరాజు, వ్యాపారవేత్త



కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): నాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. వాలీబాల్ ఆడుతుండే వాడిని. హాకీ కోచ్ రవిరాజా, కాకినాడ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవిచంద్రప్రసాద్ పరిచయంతో హాకీపై మక్కువ ఏర్పడింది. అందుకే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి కావాల్సిన క్రీడా పరికరాలు అందిస్తూ ప్రోత్సహిస్తుంటాను. అలాగే హాకీ క్రీడాకారులకు కూడా సహాయ సహకారాలు అందిస్తుం టాను. స్పోర్ట్స్ ద్వారానే స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది. ఇదే స్ఫూర్తితో జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి స్పాన్సర్‌గా వ్యవహరించడమే కాకుండా, ఈ నెల 21న క్రీడాకారులకు మంచి క్యాంప్ ఫైర్ ఏర్పాటు చేయడంతో పాటు బడాఖానా ఏర్పాటు చేస్తున్నాం.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

● కాకినాడలో కొనసాగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్



కాకినాడ క్రీడా మైదానంలో తలపడుతున్న ఆంధ్రా, గోవా జట్ల క్రీడాకారులు



పోటీల్లో విజేతగా నిలిచిన ఆంధ్రా జట్టు



కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ పట్టణంలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ పోటీలు నాల్గో రోజైన మంగళవారం ఉల్లాసంగా ఉత్సాహభరితంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లతో మొత్తం ఎనిమిది మ్యాచ్‌లను నిర్వహించారు. ఈ పోటీలకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్, వెటరన్ వాలీబాల్ క్రీడాకారుడు సూర్యనారాయణరాజు, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు లంక జార్జ్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ పట్టాభిరామ్, సీనియర్ హాకీ కోచ్ మురళీధర్, డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు, తదితరులు హాజరాయ్యరు. ఇందులో ఒడిశా సెక్రటేరియట్, ఢిల్లీ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా సెక్రటేరియట్ 16-0 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్, తెలంగాణ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ 18-0 తేడాతో విన్ అయ్యింది. బీహార్ సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీహార్ సెక్రటేరియట్ 7-1 తేడాతో విజయం సాధించింది. అలాగే గుజరాత్ సెక్రటేరి యట్, రాజస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ సెక్రటేరియట్ జట్టు 11-2 తేడాతో గెలిచింది. పాండిచ్చేరి సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జట్టు 6-4 తేడాతో విజయం సాధించింది. ఆర్‌ఎస్పీబీ సిమ్లా, ఆర్‌ఎస్పీబీ జైపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్పీబీ జైపూర్ 9-2 తేడాతో విజయం సాధించింది. ఆర్‌ఎస్పీబీ ముంబై, ఆర్‌ఎస్పీబీ చెన్నై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్పీబీ ముంబై 5-1 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, గోవా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 23-0 తేడాతో విజయం సాధించింది. విజేత జట్లను ప్రకటించారు.

● పర్యాటక ప్రాంతాలను సందర్శించిన క్రీడాకారులు

దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు కాకినాడ జిల్లాలో పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. కోరంగి మడఅడవులు, వాకలపూడి బీచ్. శిల్పారామం, అన్నవరం సత్యదేవుని ఆలయం, యానాం, ఉప్పాడ, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామల్లో శివాలయాలను సందర్శిస్తున్నారు.



హాకీ ఆడుతున్న మహిళా క్రీడాకారులు



కాకినాడ జిల్లా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్ శ్రీధర్



పాయింట్ల కోసం ఉత్సాహంగా ఆడుతున్న దృశ్యం

అప్పట్లో ఇన్ని సౌకర్యాలు ఉండేవి కాదు

● కేఎల్ నాగమణి, ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్, ఏపీ ఉమెన్ టీం కెప్టెన్

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మేము ఆడే రోజుల్లో ఇన్ని సౌకర్యాలు ఉండేవి కాదు. అయినా క్రీడలపై మక్కువతో ఎంతో ఇష్టంగా నేర్చుకునే వాళ్లం. ఆడడానికి హాకీస్టిక్స్, కాళ్లకు షూస్ గానీ ఉండేవి కావు. అప్పుడు నేడు పడ్డ కష్టానికి ఫలితమే హాకీ క్రీడకు చేసిన సర్వీస్‌కి గుర్తింపుగా 2019లో అప్పటి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకోగలిగాను. ఇప్పుడైతే హాకీ క్రీడాకారుల కోసం కాకినాడలో కోట్లు ఖర్చుపెట్టి ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్ ఏర్పాటు చేయడంలో కలెక్టర్ షాన్‌మోహన్‌కి క్రీడల పట్ల ఆయనకు ఉన్న ఇష్టం తెలుస్తుంది. దీనికి గాను హాకీ కోచ్ రవిరాజు కృషి ఎంతో ఉంది. అందుకు తగ్గ ఫలితమే ఆలిండియా సివిల్ సర్వీసెస్ వంటి గొప్ప టోర్నమెంట్‌కి కాకినాడ వేదికగా నిలిచింది.



శివయ్యా.. దారి చూపయ్యా!?



- కుంభమేళాకు వెళ్లేదారిలేక ఇక్కట్లు
- నేరుగా ఒకటే రైలు..విపరీతమైన రద్దీ
- వేలాది మంది భక్తుల్లో అసంతృప్తి
- ప్రత్యేక బస్సుల్లో నిండుతున్న సీట్లు
- ఇప్పుడైనా రైళ్లు వేయాలని వినతులు
- 26తో మహా కుంభమేళా ముగింపు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కుంభమేళాకు వెళ్లాలంటే ఈ ప్రాంతవాసులు రైలు రిజర్వేషన్లతో కుస్తీ పట్లు పట్టాల్సి వస్తోంది. చాంతాడంత వెయిటింగ్ లిస్టులు చూస్తుంటే శివ.. శివా అని ఆశువుగా నోటి నుంచి వచ్చేస్తోంది. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంది. అయితే ఆ మేరకు రైళ్లు మాత్రం లేవు. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉన్న పురందేశ్వరి రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా.. కుంభమేళా రైళ్లు నడపడంలో మాత్రం ఈ ప్రాంతానికి ఆ మేరకు ప్రాధాన్యం దక్కలేదనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్‌కి వందల రైళ్లు నడుపుతున్నామంటూ దక్షిణ మధ్య రైల్వే ఎంతో గర్వంగా చెబుతున్నా కాకినాడ నుంచి మాత్రం ఒకే ఒక్క వారాంతపు రైలు వేశారు. అటు విజయవాడ, ఇటు విశాఖ నుంచి రైళ్లు వేసినా పుష్కర ప్రాముఖ్యం ఉన్న రాజమహేంద్రవరం ప్రాంతంపై ఎందుకనో చిన్న చూపు చూశారు. మరో వైపు ప్రత్యేక బస్సులు వేస్తున్నా తక్కువ సమయంలో సీట్లు నిండుకుంటు న్నాయి. మహా శివరాత్రి పర్వదినమైన ఈ నెల 26వ తేదీతో మహా కుంభమేళా ముగుస్తున్నా రైళ్ల సంఖ్యలో మాత్రం పెరుగుదల లేకపోవడంపై జనం విస్తుపోతున్నారు. కనీసం ఇప్పుడైనా రెండు మూడు ప్రత్యేక రైళ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు.

శివా.. ఎలా వచ్చేది!



రాజమండ్రి నాలుగు జిల్లాలకు ప్రధాన రైల్వే స్టేషన్. అటు కోనసీమ, ఇటు తీరప్రాంతం కాకినాడ, ఓ వైపు తూర్పు మన్యం, మరోవైపు ఆధ్యాత్మిక ధామం రాజమహేంద్రవరం. ప్రతిరోజూ సుమారు ఈ రైల్వే స్టేషన్ నుంచి 35 వేల మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఇక్కడి నుంచి కుంభమేళాకు ఒకటే ప్రత్యేక రైలు వేశారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు తదితర ప్రాంతాల నుంచి కేవ లం 15 వరకూ బస్సులను నడపగలిగారు. బస్సులో వెళ్లడం అందరికీ సాధ్యపడదు. టికెట్ ధర రూ.13 వేల వరకూ ఉండగా.. దాదాపు 13 పుణ్యక్షేత్రాలు చూపిస్తున్నారు. బస్సు జర్నీ మొత్తం 11 రోజుల పడుతోంది. దీంతో వద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వెనకడుగు వేయక తప్పదు.రైలులో అయితే 20-24 గం టల్లో ప్రయాగ్ రాజ్ చేరుకోవచ్చు.ఇప్పటికైనా 26 వరకూ రిజర్వేషన్,జనసాధారణ్ రైళ్లను నడపాలనే డిమాండ్ వినవస్తోంది.

నేరుగా ఒకటే రైలు

రాజమండ్రి గుండా వెళ్లేలా కాకినాడ నుంచి ఒకే ఒక ప్రత్యేక రైలును నడుపుతున్నారు. అది కూడా గురువారం మాత్రమే. ఇది పూర్తిగా ఏసీ రైలు కావడంతో టికెట్ ధర రూ.2180 చెల్లించాలి. ఇది సాధారణ భక్తులకు భారమే అయిన ప్పటికీ ఆ రైలుకు వెయిటింగ్ లిస్ట్ 180కి చేరుకొంది. ఢిల్లీ వెళ్లి అక్కడి నుంచి వెళ్దామని అనుకున్నా రాజమహేంద్రవరం నుంచి రోజూ ఏపీ ఎక్స్‌ప్రెస్ ఒకటే అందుబాటులో ఉంది. దీనికీ వెయిటింగ్ లిస్ట్ 80 దాటింది. వారానికి రెండు సార్లు స్వర్ణ జయంతి నడుస్తోంది. ఇలా బ్రేక్ జర్నీల్లో ఒక రైలుకు రిజర్వేషన్ దొరికితే మరో రైలుకు దొరక్కపోవచ్చు. దీంతో చాలామంది ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నారు. ఇక విజయవాడ నుంచి చూస్తే వారాంతపు రైళ్లయిన చెన్నై-గయ, పాటలీపుత్ర, కన్యాకుమారి-కాశీ(2), కోయంబత్తూరు-ధన్‌బాద్ టికెట్లు లేవు. రోజూ నడిచే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో కూడా సీట్లు ఖాళీ లేవు. విశాఖపట్నం నుంచి సోమవారం, బుధవారం, శనివారం కుంభమేళా స్పెషల్స్ వేసినా వాటికి వెయిటింగ్ లిస్ట్ 200 దాటిపో యింది. విమానం విషయానికొస్తే.. హైదరాబాద్ గుండా ప్రయాగ్ రాజ్ సర్వీసులు ఉన్నాయి. అయితే ధర మాత్రం ఒక్కో వెబ్‌సైటులో ఒక్కోలా ఉంది. ఓ వెబ్‌సై టు రూ.18-23 వేలు చూపిస్తుండగా.. మరో వెబ్‌సైటు లో 23వ తేదీకి ఏకంగా రూ.43 వేల టికెట్ ధర ఉంది. ఏదేమైనా విమానంలో ఇక్కడి నుంచి దంపతులు ప్రయాగ్‌రాజ్ వెళ్లి రావాలంటే లక్షణంగా రూ.లక్ష వరకూ ఖర్చవుతోంది. అటు బస్సుల్లో వెళ్లలేక, ఇటు రైళ్లలో ఖాళీ లేక, మరో వైపు విమానానికి డబ్బులు పెట్టలేక కుంభమేళాకు వెళ్లే దారి చూపాలని శివుడిని వేడుకొంటున్నారు.

నన్నయ యూనివర్శిటీ వీసీగా ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగ ఆచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతరించి పోతున్న గిరిజన భాషలను కాపాడుకునేందుకు విశేష కృషి చేసి 19 గిరిజన భాషలకు లిపి రూపొందించిన తొలి మహిళామూర్తిగా ప్రసన్న నిలిచారు. 20 22లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తా పురస్కారాన్ని అందుకున్నారు. 38 సంవత్సరాల బోధనా అనుభవంలో ఎన్నో భాషా, సాహిత్య సంస్కరణలకు కృషిచేసారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సెమినార్లు నిర్వహించారు. అనేక పరిశోధనా వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయి. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు అందుకున్నారు. నిత్యం భాషా, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రసన్నశ్రీ ప్రస్తుతం నన్నయ విశ్వవిద్యాలయం వీసీగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీగా ఆచార్య వై.శ్రీనివాసరావు ఏడు నెలలుగా కొనసాగుతున్నారు. ఆయన నన్నయ విశ్వవిద్యాలయంలో భూగర్భశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తూ గత ఏడాది జూలై 18న నన్నయ ఇన్‌ఛార్జి వీసీ బాధ్యతలు చేపట్టారు.

జేఎన్టీయూకే వీసీగా ప్రసాద్

వర్శిటీ 6వ వీసీగా బాధ్యతలు చేపట్టనున్న ప్రొఫెసర్

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే నూతన ఉపకులపతిగా ప్రొ ఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్, వర్శిటీ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు ప్రొఫెసర్ ప్రసాద్‌ను వీసీగా నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేసినట్టు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. ప్రసాద్ ప్ర స్తుతం తెలంగాణలోని వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో సివిల్ ఇంజనీరింగ్, ఎంటెక్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మూడేళ్లపాటు జేఎన్టీయూకే ఉపకులపతిగా కొనసాగుతారు. గుంటూరు జిల్లాకు చెందిన సీఎస్ ఆర్కే ప్రసాద్ తల్లిదండ్రులు సాంబశివరావు, వెంకట సుబ్బమ్మ. ఆయన గుంటూరు జిల్లా అమర్తలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి, తెనాలిలోని వీఎస్ఆర్, ఎన్వీఆర్ కళాశాల్లో ఇంటర్ ఎంపీసీ, వరంగల్‌లోని రీజినల్ ఇంజనీరింగ్ కళాశాల(ప్రస్తుత ఎన్ఐటీ వరంగల్)లో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రసాద్ పర్యవేక్షణలో ఇప్పటివరకూ 8మంది పీహెచ్‌డీ పూర్తిచేయగా ఐదుగురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. 2008లో జేఎన్టీయూకే విశ్వవిద్యాలయం ఏర్పాటు కాగా మొదటి ఉపకులపతిగా ప్రొఫెసర్ అల్లం అప్పారావు, రెండో వీసీగా జి.తులసీరామ్‌దాస్, మూడో వీసీగా వీఎస్ఎస్ కుమార్, నాలుగో వీసీగా ప్రొఫెసర్ ఎం.రామలింగరాజు, 5వ వీసీగా ప్రొఫెసర్ జీవీ ఆర్ ప్రసాదరాజు విధులు నిర్వర్తించగా 6వ వీసీగా ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ బాధ్యతలు చేపట్టనున్నారు.

బాలబాలాజీ హుండీల ఆదాయం రూ.43.30 లక్షలు

మామిడికుదురు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులోని అప్పనపల్లి బాలబాలాజీ హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్ష ణలో మంగళవారం తెరిచి లెక్కిం చారు. 68 రోజులకు ప్రధాన హుం డీల ద్వారా రూ.43,30,182 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 13గ్రాముల బంగారం, 131 గ్రాముల వెండి లభించిందన్నారు. లెక్కింపులో ఆలయ అర్చకులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, బ్యాంక్ ఆఫ్ బరోడా అప్పనపల్లి శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అల్లూరి మన్యంలో 'ఆర్గానిక్ సెజ్'

- సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నాం
- పోలవరం పునరావాసమూ ప్రాధాన్యాతాంశమే
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి మన్యం జిల్లాలో ఆర్గానిక్ వ్యవసాయ, ఉద్యానవన తదితర అంశాల ప్రాధాన్యంగా స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఎస్ఈజెడ్) ఏర్పాటు దిశగా సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అన్ని అంశాల్లో గిరిజనుల భాగస్వామ్యం ఉండా లన్న ప్రభుత్వ నిర్దేశాన్ని అమలు చేసే చర్యలు చేపడుతున్నామని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రంప చోడవరం పర్యటనకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన వన రంగాల వృద్ధి ద్వారా గిరిజన జీవన ప్రమాణాలను పెంచే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అరకు కాఫీ, రంప రబ్బరు, అనేక కలపేతర అటవీ ఉత్పత్తులు కొన్ని దశాబ్దాలుగా గిరిజనుల ద్వారా వచ్చి అనేక చేతులు మారి మైదాన ప్రాంతాలకు, ఇతర దేశాలకు కూడా దళారుల ద్వారా ఎగుమతి అవుతు న్నాయన్నారు. ఆయా ఉత్పత్తుల విలువ హెచ్చింపు చర్యలను గిరిజనులతోనే అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులతో చేపట్టి తద్వారా వాటికి మంచి గిట్టుబాటు రప్పించే దిశగా చర్యలు చేపడుతు న్నామన్నారు. ఇందులో భాగమే ఆర్గానిక్ సెజ్ అన్నారు. ఈ ఎస్ఈజెడ్ పూర్తిగా గిరిజనుల భాగస్వామ్యంతో, గిరిజన సంక్షేమ అనుబంధ వ్యవస్థల సహాయంతో ఏర్పాటవుతుం దన్నారు. తద్వారా ఇక్కడి ఉత్పత్తులకు ప్రత్యేక విలువ కలిగి అంతర్జాతీయ మార్కెట్లో కూడా స్థానం దక్కుతుందన్నారు.




విజన్ డాక్యుమెంట్ల రూపకల్పన

రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏల ద్వారా గిరిజనాభివృద్ధికి విజన్ డాక్యు మెంట్లను రూపొందిస్తామన్నారు. మన్యంలో అధికారులు గిరిజన హక్కులను పరిరక్షించాలన్నారు. గిరిజనుల హక్కులు, గిరిజన ప్రాంత వనరుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తో ఉందన్నారు. గిరిజనుల హక్కు లకు ఎక్కడ భంగం కలిగినా ఉపేక్షిం చేది లేదని, గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమ లు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఉన్న వ్యవస్థలను మరింత పటిష్ఠపరుస్తున్నామన్నారు. గిరిజన చట్ట ఉల్లంఘనలపై నమోదై పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలన్న లక్ష్యాలను ఆయా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులకు, అదనపు ఏజెంటు కోర్టులకు నిర్దేశించామని చెప్పారు.

'జన్‌మన్' ఇళ్ల పూర్తికి చర్యలు


అల్లూరి జిల్లాలో ఆదిమ జాతి గిరిజనులు (పీవీటీజీ) కోసం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిధులతో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద 25,578 ఇళ్లు మంజూరయ్యాయని, వాటిని త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. అదనంగా 576 రహదారులు, 1660 మంచినీటి పథకాలు మంజూరయ్యాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పునరావాస చర్యలను వేగవంతం చేస్తున్నామన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

డెల్టా కాలువలకు 8600 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 8600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2600 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4300 క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదల అవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 8600 క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.60అడుగులుగా నమోదయింది.

అప్పుడే ఎండ తీవ్రత!



అప్పు'డే' ఎండల తీవ్రత పెరిగింది. ఫిబ్రవరిలోనే వేడిమి వాతావరణం మొదలైంది. మంచు, చలి ఉధృతంగా ఉండాల్సిన సమయంలో ఉదయం నుంచే ఎండ మండుతోంది. నాలుగైదు రోజులుగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో 35 నుంచి 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అంతకుమించి నాలుగైదు డిగ్రీలు అధికంగా ఉందన్న స్థాయిలో ఎండ తీవ్రత ఉంది.

- ఫిబ్రవరిలోనే మొదలైన వేడి వాతావరణం
- శివరాత్రి రాకుండానే ఉక్కపోత ప్రారంభం
- అత్యధిక ప్రాంతాల్లో 35 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు అధికం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. ఉదయం 11గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు జిల్లా అంతటా వేడి వాతావరణమే కనిపిస్తోంది. రాత్రికి ఉక్కపోత కూడా పెరిగింది. సాధారణంగా ఈ సమయంలో జిల్లాలో 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. పగటిపూట కూడా చలి వాతావరణమే ఉంటుంది. అర్ధరాత్రి నుంచి చలితో కూడిన మంచుపడుతూ ఉదయం 9గంటల వరకు ఆ ప్రభావం ఉంటుంది. అనంతరం కూడా ఎండ పెద్దగా ఉండదు. శివరాత్రి పండుగ వరకు ఈ తరహా వాతావరణం కొనసాగుతుంది. అనంతరం క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. ఈ ఏడాది అందుకు భిన్నంగా కనిపిస్తోంది. శివరాత్రి ఇంకా8రోజులు ఉండగా అప్పుడే ఎండల తీవ్రత పెరిగింది.

ఈ వేసవిలో ఎండలు అధికమే..

ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ సంకేతాలు ఇస్తుండగా ఆ ప్రభావం ఇప్పటినుంచే కనిపిస్తోంది. జిల్లాలోని అత్యధికప్రాంతాల్లో నాలుగైదురోజులుగా మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదువుతోంది. క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. కాకినాడలో మంగళవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలుగా ఉంది. ఇక్కడ ఈనెల 1న 31.7 డిగ్రీలు, 2న 32.7 డిగ్రీలు, 3న 34.3 డిగ్రీలు నమోదైంది. గత నాలుగైదు రోజుల్లో ఉష్ణోగ్రత పెరిగింది. ఈ సమయంలో ఇలాంటి వాతావరణం ఉండడంతో వేసవిలో ఏస్థాయిలో ఎండలు ఉంటాయోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతుంది.

ఉపాధి నిమిత్తం వెళ్లి..
కువైట్‌లో మృతి


తారక ముత్యాలరాము (ఫైల్)


ఆవేదన వ్యక్తం చేస్తున్న రాము కుటుంబ సభ్యులు

- ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపిన తోటి డ్రైవర్
- మృతుడిది కోనసీమ జిల్లా మొగలికుదురు
- వేధింపులు తాళలేకే బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని కుటుంబసభ్యుల ఆరోపణ

మామిడికుదురు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పరాయి దేశానికి వెళ్లిన ఆ యువకుడు అర్థంతరంగా తనువు చాలించాడు. కారణం ఏంటనేది స్పష్టంగా తెలియనప్పటికీ ఉద్యోగంకోసం వెళ్లిన కుమారుడు అకస్మాత్తుగా మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వేధింపులు భరించలేకపోతున్నానని ఫోన్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మొగలికుదురుకు చెందిన నేదూరి రామలక్ష్మి-సురేష్ దంపతుల కుమారుడు నేదూరి తారక ముత్యాలరాము(24) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లాలనుకుని కొమరాడకు చెందిన వలవల నాగరాజును సంప్రదించాడు. వీసా నిమిత్తం అతడికి రూ.85వేలు కూడా ఇచ్చాడు. గతేడాది డిసెంబరు 28న బయలుదేరి జనవరి 1న కువైట్‌లో అడుగుపెట్టాడు. అప్పటినుంచి నాగరాజు వేధింపులు భరించలేకపోతున్నానని రాము పలుమార్లు తమకు ఫోన్‌లో చెప్పేవాడని, కొన్నిరోజులు పోతే వేధింపులు తగ్గుతాయని తమ కుమారుడికి నచ్చచెప్పినట్టు తల్లిదండ్రులు తెలిపారు. తమ యజమాని మంచివాడే కానీ తన సాటి డ్రైవర్‌గా చేస్తూ తనతోపాటే రూములో ఉండే నాగరాజు మాత్రం తనను నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడని పలుమార్లు తమ దృష్టికి తెచ్చాడని వారు వాపోయారు. ఈనెల 13న గురువారం సాయంత్రం రాము కనిపించడం లేదని, ఎక్కడికో పారిపోయాడని కువైట్‌లోనే ఉంటున్న తమ బంధువులకు నాగరాజు ఫోన్ చేసి చెప్పాడన్నారు. అదేరోజు సాయంత్రం స్థానికంగా ఉన్న బీచ్ వద్ద పాడుపడిన బంగ్లాలో రాము ఉరివేసుకున్నాడని సమాచారం ఇచ్చాడన్నారు. దీంతో తమ బంధువులు కూడా సంఘటనా స్థలానికి వెళ్లి చూశారన్నారు. దీంతో వారు ఇండియన్ ఎంబసీ అధికారులు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతో ఈనెల 17వతేదీ సోమవారం మృతదేహం స్వగ్రామం వచ్చిందని రాము తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడని కాదని, వీసా తీసిన వ్యక్తి వేధింపులకు పాల్పడడంవల్ల మరణించాడా లేక మరేమైనా జరిగిందా అన్న అనుమానంగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఈనెల 14న నగరం పోలీస్‌స్టేషన్‌లో, తహశీల్దార్ కార్యాలయంలోను, 15న కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని మృతుడి తల్లిదండ్రులతోపాటు సోదరుడు ఫణీంద్రకుమార్ తెలిపారు.

దొంగసాధువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పెద్దాపురం పోలీసుల హెచ్చరిక


సీసీ ఫుటేజీలో దొంగ సాధువు

పెద్దాపురం(సామర్లకోట), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దొంగ సాదువులపట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో రెండురోజులుగా సాధువునని నమ్మించి ఓవ్యక్తి స్థానిక దుకాణాలవద్ద ఆశీర్వాదాలు అందిస్తున్నట్లు నటించి వారి నుంచి సొమ్ములను తీసుకుని పరారీ అవుతున్నట్లు పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఇటువంటి దొంగ సాధువులెవరైనా షాపులవద్దకు వస్తే తక్షణం తమకు సమాచారమివ్వాలని పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

బాలిక అనుమానాస్పద మృతి


మృతదేహం వద్ద రోధిస్తున్న బాలిక కుటుంబసభ్యులు

- ఆమెను పెళ్లి చేసుకున్న వ్యక్తి అరెస్టు
- అతడి వేధింపులు తాళలేకే ఆత్మహత్య చేసుకుందని స్థానికులు, బాలిక కుటుంబీకుల ఆరోపణ
- గతంలోనూ అతడిపై కేసు

సామర్లకోట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం మాధవపట్నంలో బాలిక అనుమానాస్పదస్థితిలో సోమవారంరాత్రి మృతి చెందగా ఈ సంఘటనలో అనుమానితుడిగా ఉన్న వ్యక్తిని సామర్లకోట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

సామర్లకోట మండలం మాధవపట్నంలో 17 ఏళ్ల దళిత బాలికను అదే గ్రామానికి చెందిన అనుసూరి విఘ్నేశ్ గతంలో ప్రేమ పేరిట వేధించేవాడు. దీంతో 2023లో బాలిక ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు. అతడిపై అప్పట్లో ఎస్సీ,ఎస్టీ, పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన విఘ్నేశ్ ఆ బాలిక వద్దకు వెళ్లి తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమెకు మాయమాటలు చెప్పి వివాహం కూడా చేసుకున్నాడు. కొంతకాలం అదే గ్రామంలో బాలికతో కాపురం పెట్టాడు. ఇటీవలకాలంలో ఆమెపై వేధింపులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో రెండురోజులుగా వారిద్దరి మధ్య ఘర్షణలకు జరుగుతున్నాయని, ఆమె శారీరకంగా వేధించాడని స్థానికులు తెలిపారు. ఈ బాధలు భరించలేక సోమవారం రాత్రి ఆమె అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉండడాన్ని చుట్టుపక్కల ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాలికను విఘ్నేశ్ తీవ్రంగా కొట్టడంవల్లే ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ మేరకు సామర్లకోట పోలీసులు కేసును వేగవంతంగా దర్యాప్తు నిర్వహించారు. ప్రాథమిక విచారణ మేరకు నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేశారు. అతడిని కఠినంగా శిక్షించాలని బాలిక కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

సాదాసీదాగా జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు




జడ్పీ సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యులు, మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా శాఖాపరమైన సమీక్షల్లేవు..
- తీర్మానాలు లేవు
- కోరం లేక గంట ఆలస్యంగా ప్రారంభం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్.. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనల ప్రకారం సమావేశాలు నిర్వహించాల్సిన తీరు.. దీనికితోడు మెజారిటీ సభ్యులు నిర్ణీత సమయానికి రాకపోవడంతో కోరం లేక జడ్పీస్థాయీ సంఘ సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభించారు. అది కూడా ఏ విధమైన శాఖాపర సమీక్షలు చేయకుండా, తీర్మానాలు ఆమోదించకుండా సమావేశాలు సాదాసీదాగా ముగించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు మంగళవారం కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన 1, 2, 4, 7 స్థాయి సంఘ సమావేశాలు, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన 3వ స్థాయి సంఘ సమావేశం, వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన 6వ స్థాయి సంఘ సమావేశం, స్థాయి సంఘ చైర్ పర్సన్ రొంగల పద్మావతి అధ్యక్షతన 5వ స్థాయి సంఘ సమావేశం జరిగాయి. ఈ సమావేశాల్లో జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, జడ్పీటీసీ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు, జడ్పీ పరిపాలనాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'నిర్లక్ష్యం'పై వేటు!

- రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు
- నలుగురు డాక్టర్లు, ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు
- నిన్న మంత్రి సుభాష్ పర్యటన.. నేడు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ ఉత్తర్వులు


ఈఎస్ఐ ఆస్పత్రిలో సోమవారం హాజరుపట్టీ పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు డాక్టర్లు, ఐదుగురు కార్యాలయ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విజయవాడలోని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంత్రి సుభాష్ ఆదేశించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ తక్షణమే స్పందించి మంగళవారం ఈచర్యలు తీసుకున్నారు.

రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిని సోమవారం మంత్రి సుభాష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సమయంలో కొందరు వైద్యులు, కార్యాలయ సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. హాజరుపట్టీని ఆయన పరిశీలించారు. కొందరు డాక్టర్లు, కార్యాలయ సిబ్బంది హాజరు నమోదు చేసుకుని విధులు నిర్వర్తించకుండా ఆస్పత్రినుంచి వెళ్లిపోతున్నట్టు గుర్తించారు. అక్కడున్న మరికొందరు సరైన సమాధానం, సమాచారం కూడా ఇవ్వలేదు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి సుభాష్ తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్‌ను ఆదేశించారు. దీంతో విధినిర్వహణలో బాధ్యతారాహిత్యంగావ్యవహరించిన డాక్టర్లు, సిబ్బందిపై వేటు పడింది. కాగా, దీనిపై విచారణ కొనసాగుతోందని, నివేదిక ఆధారంగా మరిన్నిచర్యలు తీసుకుంటామని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఈఎస్ఐబీమా చందాదారులు, వారి కుటుంబీకులకు నాణ్యమైన వైద్యసేవలందజేసేందుకు కట్టుబడి ఉందని, రోగుల విషయంలో నిర్లక్ష్యం, క్రమశిక్షణారాహిత్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం



చింతూరు నుంచి డొంకరాయికి ఆటోలో తరలిస్తున్న మద్యం

చింతూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు నుంచి ఆటోలో డొంకరాయి బెల్టు షాపునకు అక్రమంగా తరలించబోయిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి చింతూరులోని షాపులకు మంగళవారం ఒక వ్యాన్‌లో మద్యం దిగుమతి అయింది. కాగా అదే వ్యాన్‌లో వై.రామవరం మండలం చవిటిదిబ్బలు వైన్‌షాప్ పేరిట 13 బీర్ కేసులు(156 బీర్లు), 11 కేసుల క్వార్టర్ బాటిళ్లు(528 బాటిల్సు) కూడా తరలించారు. ముందుగా అనుకున్న ప్రణాళిక మేరకు ఇక్కడినుంచి వై.రామవరం మండలం డొంకరాయిలోని ఒక బెల్టు షాప్‌నకు ఈ బాటిళ్లను తరలించేందుకు ఆటోలో లోడు చేశారు. విషయం పసిగట్టిన కొంతమంది వ్యక్తులు చింతూరులోని ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఎక్సైజ్ అధికారులు వ్యాన్, ఆటోల వద్దకు చేరుకుని అక్రమంగా తరలించబోతున్న మద్యం బాటిళ్లు, ఆటోని సీజ్ చేయడంతోపాటు ఆటో డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఎక్సైజ్ ఎస్ఐ (చింతూరు) వై.వీరవెంకటసత్యలక్ష్మణస్వామిని సంప్రదించగా అక్రమ తరలింపునకు సిద్ధం చేసిన మద్యం సహా ఆటోను సీజ్ చేశామని, ఆటో డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.లక్షా12వేల వరకు ఉంటుందన్నారు.

'పాదగయ'లో మహాశివరాత్రి ఉత్సవాలకు అదనపు సిబ్బంది

- సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత
- దేవదాయశాఖ ఆర్‌జేసీ సుబ్బారావు


పిఠాపురం పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు

పిఠాపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో జరిగే కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు సుబ్బారావు తెలిపారు. ఉత్సవాలకుగాను వివిధ ఆలయాలనుంచి అదనపు సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ఆయన మంగళవారం సందర్శించుకున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. సామాన్య భక్తులకు దర్శనాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. దర్శనాల సమయంలో భక్తులను ఆపడం, ఆటంకాలు కల్పించడం చేయవద్దని అర్చకులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాదగయ పుష్కరిణి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. స్నానాలు ఆచరించిన తర్వాత భక్తులు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. పిండ ప్రదానాలు, మూసివాయనాల కోసం భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం తోపాటు వచ్చిన వారు త్వరగా కార్యక్రమాలు పూర్తి చేసుకుని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయం ఆవరణ, బయట పారిశుధ్య నిర్వహణ, భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. దేవాదాయశాఖ కమిషనరు ఆదేశాల మేరకు చీఫ్‌ఫెస్టివల్ ఆఫీసర్‌గా అన్నవరం దేవస్థానం ఏఈవోను నియమించినట్లు తెలిపారు. ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా దేవదాయశాఖ అధికారి దుర్గాభవానీ, పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సామర్లకోటలో పరిశీలన


సామర్లకోట భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్‌జేసీ

సామర్లకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సుబ్బారావు సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించి స్థానిక అధికారులకు తగు సూచనలు చేశారు. సామర్లకోటలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయనున్నందున వారికి ఆలయ ఆవరణలో అన్ని రకాల సదుపాయాలు కలుగజేయాని సూచించారు. వీఐపీల దర్శనాలతో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సామర్లకోట ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, దేవదాయ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఉప్పుటేరులోకి దూకి యువతి ఆత్మహత్య


అరుణ(ఫైల్ ఫోటో)

కాకినాడ క్రైం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఉప్పుటేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడలోని సూర్యనారాయణపురానికి చెందిన అనపాల అరుణ(24) స్థానిక వెంకీ రెసిడెన్సీ హోటల్లో హౌస్ కీపర్‌గా పనిచేస్తోంది. కాగా ఆమె బయట అప్పులు అధికంగా చేస్తుండడంతో ఈనెల 16న తల్లిదండ్రులు మందలించారు. దీంతో అరుణ అదేరోజు రాత్రి 10.30గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కుటుంబీకులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో అరుణ కుటుంబీకులు స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఉమెన్ మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అరుణ మృతదేహం స్థానిక జగన్నాథపురం ఉప్పుటేరులో తేలినట్లు మంగళవారం పోలీసులు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
FINANCE
గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:297808

4 Lines CLASSIFIED Rs.230/- Only

భారీ వాహనంతో నిలిచిన ట్రాఫిక్



రావులపాలెం హైవేపై వెళ్తున్న భారీ వాహనం

రావులపాలెం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గోపాలపురం రావులపాలెం జాతీయరహదారిపై భారీ వాహనం కారణంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇదే తరహా మరో మూడు వాహనాలు కూడా జాతీయ రహదారి వెడల్పున సరిపడగా ఒకేసారి ప్రయాణించడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఈతకోట టోల్‌గేట్‌వద్ద గౌతమి వంతెన మీద వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

చెందుర్తిలో మరో 1500 కోళ్లు మృతి

ఖననం చేసిన ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు



కోళ్లు ఖననం చేసిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తిలో పుష్కర-పోలవరం కాలువ గట్టుపై ఉన్న కోళ్ల ఫారంలో మరో 1500 కోళ్లు మంగళవారం మృత్యువాత పడ్డాయి. ఇప్పటివరకూ ఈ ఒక్కఫారంలోనే 6వేల కోళ్లు చనిపోయాయి. చనిపోయిన కోళ్లను జనావాసాలకు దూరంగా గోతులు తీసి ఖననం చేశారు. బర్డ్‌ఫ్లూ అనుమానిత కోళ్లు ఖననం చేసిన ప్రదేశం కాబట్టి ఇక్కడ ప్రజలు, వాహన రాకపోకలు నిషిద్ధమంటూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

స్టాక్ మార్కెట్ పేరుతో టోకరా

రూ.14.92 లక్షల ఆన్‌లైన్ దోపిడీ

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నారాయణపురానికి చెందిన బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసే బి.శ్రీనివాస్ అనే వ్యక్తి స్టాక్ మార్కెట్ పేరుతో వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి పెట్టుబడి పెట్టి రూ.14.92 లక్షల నగదు పోగొట్టుకున్నాడు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ 2024, డిసెంబరులో తన ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే డబ్బులు రెట్టింపు అవుతుందనే సందేశాన్ని చూసి దఫదఫాలుగా రూ.14లక్షల92వేలు పెట్టుబడి పెట్టారు. దీనికి సంబంధిచి రూ.40లక్షలు నగదు అతడికి రావాల్సిందని మెసేజ్‌లో చూపించింది. తనకు రావాల్సిన డబ్బుల కోసం సదరు ఆన్‌లైన్‌లో ప్రయత్నించగా వారు అకౌంట్ క్లోజ్ చేశారు. దీంతో బాధితుడు మంగళవారం ప్రకాష్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

స్టడీ మెటీరియల్ పంపిణీ

కరప, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సానా సతీష్‌బాబు ఫౌండేషన్ సంస్థ ఛైర్మన్ తలాటం హరీష్ ఆధ్వర్యంలో మంగళవారం కరప గ్రంథాలయంలో నిరుద్యోగ యువతకు రూ.10 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్స్‌ని సోషల్ వర్కర్ పోలిశెట్టి నారయ్య అందించారు. కార్యక్రమంలో అడపా శ్రీను, పెంకే రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద వైసీపీ నేతలు అడ్డగింత

చలో తునికి అనుమతులు లేవన్న పోలీసులు, అక్కడే బైఠాయించి నిరసన



గొల్లప్రోలులో వైసీపీ నేతలు ద్వారంపూడి, కన్నబాబు, ఉదయభాస్కర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): చలో తునికి తరలివెళ్తున్న వైసీపీ నేతలను గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం పోలీసులు అడ్డుకున్నారు. తునిలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా చలో తునికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల 216వ జాతీయ రహదారిపై పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కార్లతో ర్యాలీగా తరలివెళ్తున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, రామచంద్రపురం వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ తదితరులను అడ్డుకున్నారు. తుని వెళ్లేందుకు అనుమతులు లేవని స్పష్టంచేశారు. పోలీసుల తీరుపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ టోల్‌ప్లాజా వద్ద బైఠాయించారు. సుమారు 2గంటల పాటు ఆందోళన నిర్వహించారు. తునిలో వైస్‌ఛైర్మన్ ఎన్నికను కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా అడ్డుకుంటున్నదని వారు ఆరోపించారు. ఈ ఆందోళనకు తుని వెళ్లి వచ్చిన కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ సంఘీభావం తెలిపారు. ఆందోళన అనంతరం నాయకులందరిని పోలీసులు వెనక్కి పంపించారు.

సామర్లకోటలో....

సామర్లకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు హెచ్చరికలను ఉల్లంఘిస్తూ సామర్లకోట నుంచి తునికి పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ నాయకులు ర్యాలీగా వెళ్లడాన్ని సామర్లకోట, పెద్దాపురం పోలీసులు స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద అడ్డుకున్నారు. పెద్దాపురం వైసీపీ ఇంచార్జి దవులూరి దొరబాబు, నాయకులు పోలీసుతో చర్చలు జరిపినప్పటికీ సమ్మతించలేదు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతలకు దారితీయకుండా దొరబాబు, ముఖ్య నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని దొరబాబు ఇంటికి తరలించి హౌస్ అరెస్ట్ చేసినట్టు పోలీసులు ప్రకటించి అక్కడ కాపలా కాశారు.



ఎన్టీఆర్ బీచ్‌లో పరిశుభ్రత కార్యక్రమం



ఎన్టీఆర్ బీచ్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న స్వచ్ఛంద సంస్థల వలంటీర్లు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌ను మంగళవారం హోప్ ఫర్ చేంజ్, రెయిన్‌బో క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సాగర తీర ప్రాంతాన్ని శుభ్ర పరిచే బాధ్యతను కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి స్వచ్ఛంద సేవా సంస్థలకు అప్పగించారు. ఈ సందర్భంగా నెలరోజుల పాటు సాగర తీరంలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి, బీచ్ సందర్శనకు వచ్చే సందర్శకులకు ఆహ్లాదం అందించే కార్యక్రమంలో భాగంగా హోప్‌ఫర్ చేంజ్, రెయిన్ బో డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.శ్రీనివాస్, ఇంటర్నేషనల్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గో గ్రీన్,సేవ్ ఎర్త్ అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన నిర్వహించారు. బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, బీచ్‌లో ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేయరాదని కోరారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు లక్ష్మీ నాగేంద్ర, బాలా త్రిపురసుందరి, సబితరెడ్డి, సత్యకుమారి, స్వాతి, దీపిక, మణి, ప్రమీల, మాధురి, నవ్య, చిన్మర్షిత, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులు విడుదల చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మత్స్యకారులకు సీఎస్ఆర్ నిధులు తక్షణమే విడుదల చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్యేలు కోరారు. ఈ మేరకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాలకు చెందిన మత్స్యకారులకు మాత్రమే నష్టపరిహారం ఇస్తున్నారన్నారు. కాకినాడ సిటీ, రూరల్, పిఠాపురం, తుని, కోనసీమ ప్రాంతాల్లోని మత్స్యకారులకు నష్టపరిహారం ఇవ్వడం లేదన్నారు. పరిశ్రమలు రావడానికి వ్యతిరేకం కాదని, అయితే సముద్ర తీర ప్రాంతాల్లో పరిశ్రమలు వల్ల మత్స్యకారులకు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. చేపల వేట కోసం సముద్రంలో వందల కిలోమీటర్ల దూరం వెళుతున్న మత్స్య కారులకు సీఎస్ఆర్ నిధులు తక్షణమే ఇవ్వాలని వారు కలెక్టర్‌ను కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



అభిషేకాల్లో పాల్గొన్న దంపతులు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం ఆలవెల్లి మల్లవరంలో కొలువైన స్వయంభూ దత్తాత్రేయస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. మంగళవారం, షష్ఠికావడంతో అభిషేకాలు చేయించుకునేందుకు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ జరిగిన అభిషేకాలు 400కిపైగా దంపత జంటలు, భక్తులు పాల్గొన్నారు. ఇక్కడ అభిషేకాలు చేయించుకుంటే పిల్లలు పుడతారనే నమ్మకం ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

'కార్మికుల సంక్షేమానికి కృషి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కార్మికుల సంక్షేమం కోసం సంజీవరెడ్డి నిరంతర కృషి చేశారని కాకినాడ జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ జి సంజీవరెడ్డి 95వ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం స్థానిక సాంబమూర్తినగర్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ అంధుల పాఠశాలలోని విద్యార్థులు, కార్యకర్తలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో టీఎస్ కుమారి, వనుం వెంకటరమణ, పీఏ ఎం పాల్, కె.శివ, సాయిగణేష్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



తాళ్లరేవు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు పశుగర్భకోశ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పశువైద్యాధికారిణి డాక్టర్ దవులూరి సుధ అన్నారు. మంగళవారం జి.వేమరం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని ఏడీ డాక్టర్ బ్రహ్మవేద ప్రారంభించారు. రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ కళ్యాణి, ప్రాంతీయ పశుసంవర్థక శిక్షణా కేంద్రం డాక్టర్ జయభారత్‌రెడ్డి వైద్యులు పాల్గొన్నారు.

'రుణాల మంజూరుకు డబ్బులు వసూలు'



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో విచారణ నిర్వహిస్తున్న వెలుగు డీపీఎం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు రుణాల మంజూరు నిమిత్తం లక్షకు వేయి రూపాయిలు వంతున వసూలు చేస్తున్నారని పలువురు మహిళలు ఆరోపించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలో పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులపై వెలుగు డీపీఎం (ఫైనాన్స్) బాబూరావు మంగళవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ సంఘాలకు చెందిన పుస్తకాలు, రికార్డులను వీవోఏల వద్ద ఉంచుకుంటున్నారని, ఎవరైనా ఈ వసూళ్ల, పుస్తకాలు గురించి ప్రశ్నిస్తే రుణాలు రానివ్వడం లేదని తెలిపారు. విచారణలో డీపీఎం భరత్,ఏపీఎం సన్యాసిరావు తదితరులున్నారు.

'రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం'

కిర్లంపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు శృంగరాయుని పాలెం సర్పంచ్ పట్టు చంటిబాబు, మాజీ సర్పంచ్ గొడే బాల అన్నారు. కిర్లంపూడిలో రోడ్లను ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, ఎంపీటీసీ గరగా గోవిందు, కె.బూరయ్య పరిశీలించారు.

అందుబాటులోకి ఆరోగ్య కేంద్రం

దుమ్ములపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆమోదం



దుమ్ములపేటలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుమ్ములపేటలో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. గత ప్రభుత్వ హయంలో కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ దుమ్ములపేట పార్క్ స్థలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించింది. రూ.2కోట్ల సీఎస్ఆర్ నిధులతో అన్ని వసతులతో నిర్మించిన ఈ భవనాన్ని నగరపాలక సంస్థకు బదిలీ చేసింది. కాగా ఈ ఆరోగ్య కేంద్రం నిర్వహణకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఆరోగ్య కేంద్రంలో ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో పాటు పరిశుభ్రత కోసం మరొక సిబ్బందిని కేటాయించారు. ప్రాథమిక వైద్యసేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు, ఇతర ఏర్పాట్లు కల్పించడానికి సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేయనున్నారు కాకినాడలో 14 పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. దుమ్ములపేటలో కొత్త ఆరోగ్య కేంద్రం ఏర్పాటుతో నగరంలో ప్రతి 25 వేల మంది జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి 50 వేల పట్టణ జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి. అయితే రాష్ట్రంలో ప్రతి 25 వేల మంది జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలందిస్తోంది. అత్యధిక జనాభా గల ప్రాంతమైన దుమ్ములపేట, పరిసర ప్రజలకు త్వరలోనే మెరుగైన వైద్య సేవలందనున్నాయి.

'ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తులను గెలిపించాలి'

ఎమ్మెల్యేలు, నాయకుల ప్రచారం



కరప: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ



కాకినాడ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు



పిఠాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి

కరప, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజశేఖర్‌కు మద్దతుగా మంగళవారం కరప మండలం వేళంగి, వాకాడ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, మొదటి ప్రాధాన్యత ఓటు రాజశేఖర్‌కు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుసుకుని కరపత్రాలు ఇచ్చి, మొదటి ప్రాధాన్యత ఓటు రాజశేఖర్‌కు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఎన్నికల అబ్జర్వర్ సీతం రాజు సుధాకర్, పార్టీనాయకులు పెంకే శ్రీనివాస బాబా, బండారు మురళీ తదితరులున్నారు.

కాకినాడ సిటీ: పట్టభద్రులకు అండగా నిలబడి వారి సమస్యలపై పోరాడే వ్యక్తి పేరాబత్తుల రాజశేఖర్ అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ సతీమణి సత్యవేణి ప్రైవేట్ స్కూల్స్ టీచర్లు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును రాజశేఖర్‌కు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. మల్లాడి రాజు, వివిధ స్కూల్స్ కరస్పాండెంట్లు మహమ్మద్ బేగ్, అమీర్‌ఖాన్, రఘు, శ్రీధర్, వెంకట సుబ్బు, చంటి, శకుంతల, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పిఠాపురం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పిఠాపురంలో ప్రచారం నిర్వహించారు. పట్టబద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రథమ ప్రాధాన్యత ఓటును రాజశేఖర్‌కు వేయాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: కూటమి అభ్యర్థి పేరాబత్తులకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబులు కోరారు. రమణయ్యపేట శివారు గైగోలుపాడు, మురళీధర్‌నగర్, బాపన్న కాలనీ, దండుపుంత, ఏపీఐఐసీ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, ఏపీఎస్పీ, ఈశ్వర్‌నగర్, రాయుడుపాలెం తదితర ప్రాంతాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్ల ఇంటికెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి పార్టీ నాయకులు బొజ్జ భవాని, పలివెల గాయత్రి, పి లీలావతి, రాయుడు అనిల్, కాళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కూటమినేతలు పలు ప్రైవేట్ స్కూల్స్ కళాశాలల్లో ప్రచారం చేశారు. దూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనాయణ, కట్టా త్రిమూర్తులు, మోహూరి వెంకటేశ్వరరావు, వుంగరాల వెంకటేశ్వరరావు, పుణ్యమంతుల సత్తిబాబు, విళ్ల వీర, వాడ్రేవు వీరబాబు, కొప్పిశెట్టి బాబి, కొమ్మోజు నాగేశ్వరరావు, రేళ్ల చక్రవర్తి ఉన్నారు.

బోధనా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'జ్ఞానజ్యోతి'

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు



సర్పవరం జంక్షన్: అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న రీసోర్స్ పర్సన్స్



కొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాల్

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ప్రాథమిక విద్యాభ్యాసం బోధించేందుకు వీలుగా అంగన్‌వాడీ టీచర్లకు బోధనా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు జ్ఞానజ్యోతి శిక్షణ ఇస్తున్నట్టు ఎంఈవో ఏసుదాసు, ఐసీడీఎస్ సీడీపీవో వై.లక్ష్మి తెలిపారు. కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్లో ఎస్ఎస్ఏ, ఐసీడీఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్ (ఎస్ఏఎల్‌టీ) కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో గల 202 అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న 6 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫైడ్ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడం, ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ కేంద్రాల్లో ప్రాథమిక విద్యాబోధన చేసేందుకు పూర్తిస్థాయిలో సమాయాత్తం చేసేందుకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని బోధన సామర్థ్యాలను పెంచుకోవాలని కోరారు. ఈనెల 18 నుంచి 20 వరకు మొదటి విడత,రెండో విడత 22 నుంచి 25 వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కేఆర్పీలు, డీఆర్పీలు శిక్షణ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, రూరల్ మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: బాల్యారంభ శిశువుల సమగ్ర అభివృద్ధికి దోహదపడాలని ఐసీడీఎస్ సీడీపీవో దుర్గాదేవి, గొల్లప్రోలు ఎంఈవో శివప్రసాద్ సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా 3 రోజులు పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను ఎంఈవో ప్రారంభించారు. పలు అంశాలు వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పెర్సన్లు మేడసాని సత్యనారాయణ, ఆకన గణేష్, అనిశెట్టి సీతారామరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, మానసాదేవి, ఇన్‌చార్జి హెచ్ఎం దూళిపూడి వీరాస్వామి, సీఆర్ఎంటీలు ఆకుల రామకృష్ణ, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి బాలుర హైస్కూల్లో తరగతులను ఎంఈవో వేణుగోపాల్, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఎస్‌కే.దుర్గాదేవి ప్రారంభించారు. ఎంఈవో-2 పైడిరాజు, సీఎంవో సీహెచ్ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

తాళ్లరేవు: మండలంలో అంగన్వాడీ వర్కర్లకు శిక్షణా కార్యక్రమాన్ని డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. తాళ్లరేవు, చొల్లంగిపేట జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్లో ఈ శిక్షణ జరిగింది. సీడీపీవో వి.మాధవి, ఎఈవో మంగాయమ్మ, ఆర్‌పీఎస్ కె.సత్యకళ్యాణి, కె.వీరేంద్రప్రసాద్, నిభావని, ప్రధానోపాధ్యాయులు ఆశాలత, శ్రీధర్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఉండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల ఆవరణలో మొదటి బ్యాచ్ అంగన్‌వాడీ సిబ్బందికి జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జీ.ఉషా అధ్యక్షతన నిర్వహించిన ఈ తరగతులకు ముఖ్య అతిథులుగా ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, వి.పుల్లయ్య, విద్యాశాఖ ఏఎంవో ఎస్వీరామారెడ్డి హాజరయ్యారు. కోర్సు డైరెక్టరు శివరామకృష్ణయ్య, టీవోటీలు వివిధ అంశాలపై సమగ్రంగా ప్రసంగించారు. వెన్యూ ఇంచార్జిగా తోటకూర సాయి రామకృష్ణ ప్రసంగించారు. అనంతరం ఎస్టీఎల్ సహాయసంచాలకులు భాస్కరరావు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి యోగా, ధ్యానంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎండీ సుల్తానాబీబీ, మంగ, నిర్మలాకుమారి, చంద్రకళ, ఉమాదేవి పాల్గొన్నారు.

'ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి'

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే అధికారులు ఇటీవల జారీచేసిన సర్క్యులర్ వర్శిటీ అవుట్ సోర్సింగ్ డ్రైవర్లను వేధించే విధంగా ఉందని దానిని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న జేఎన్టీయూకే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలను ఉన్నతాధికారులు గుర్తించాలన్నారు. వినతి అందజేసిన వారిలో సీఐటీయూ నగర కోకన్వీనర్ పలివెల వీరబాబు, కన్వీనర్ వెంకటరమణ, జిల్లా కార్యదర్శి సీహెచ్ పద్మ ఉన్నారు.

పిఠాపురంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

పిఠాపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు, చిన్నారుల డ్యాన్స్‌లు అలరించాయి. పిఠాపురంలోని సీతయ్యగారితోట గల ఆదిత్య పాఠశాల ఉడాన్ 11వ వారికోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. విద్యార్థిని, విద్యార్థులు డాన్స్‌లతో హోరెత్తించారు. కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు, నృత్యాభినయాలతో అలరించారు. అంతకు ముందు ఆదిత్య ఉడాన్ వార్షికోత్సవాన్ని ఆదిత్య పూర్వ విద్యార్థి, కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, కార్తీకేయ హాస్పటల్స్ అధినేత డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ ఆర్.విజయసారథి, బ్లూమింగ్ మైండ్స్ ఇన్‌చార్జి శ్రీనివాస్, కిండర్ వండర్ ఇన్‌చార్జి రేవతి ఉన్నారు.





విద్యార్థుల ప్రదర్శనల దృశ్యాలు



పాదగయ క్షేత్రంలో విరాళం అందజేస్తున్న దాత నారాయణరాజు దంపతులు

పాదగయలో నిత్యాన్నదానానికి విరాళం

పిఠాపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో కొలువయి ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్ట్‌కు కాకినాడకు చెందిన కలిదిండి భాస్కర నారాయణరాజు దంపతులు రూ.లక్షా వేయి నూట పదహార్లు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని మంగళవారం ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్‌కు అందజేశారు. దాత దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేషవస్త్రాలను అందజేశారు.

గోరింట గ్రామంలో డీఎంహెచ్‌వో పరిశీలన



సర్వే పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

పెద్దాపురం/సామర్లకోట), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో వైద్యఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఎన్‌సీడీసీడీ సర్వేను జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరసింహానాయక్ మంగళవారం పరిశీలన చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు సర్వే సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా అని పరీక్షించారు. ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల, వైద్య సదుపాయాలు కలుగజేసేందుకు నిర్వహిస్తున్న సర్వే లక్ష్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్‌సీడీసీడీ నోడల్ అధికారి డాక్టర్ ప్రభాకర్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణి, భద్రం సురేష్, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఉన్నారు.

తాటిపర్తిలో అపర్ణా దీక్షల స్వీకరణ



తాటిపర్తిలో భక్తులకు అపర్ణాదేవి మాలధారణ చేస్తున్న వేదపండితులు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసి ఉన్న అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అపర్ణా దీక్షల స్వీకరణ కార్యక్రమం జరిగింది. అమ్మవారి సమక్షంలో భక్తులు 21రోజులు పాటు సాగే దీక్షను స్వీకరించారు. వారికి ఆలయ వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకుడు ప్రభాకరశాస్త్రి మాలధారణ చేశారు. దీక్షా వస్త్రాలను ఆలయ కమిటీ ప్రతినిధులు ఉచితంగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు చెరుకు శ్రీను, ఆకుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెద్దాపురం/సామర్లకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో రోడ్లు భవనాల శాఖ కార్యాలయం పక్కన ఉన్న ఒక పాత భవనంలో మంగళవారం పట్టపగలే ఇంటి తాళాలు పగలకొట్టి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడినట్లు పెద్దాపురం పోలీసులకు మంగళవారం సాయంత్రం ఫిర్యాదు అందింది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు.. ఇంటిలో గ్యాస్‌సిలిండరు, మోటారు తదితర సామాగ్రి చోరీకి గురైనట్టు గుర్తించారు.

రాయభూపాలపట్నంలో లారీల అడ్డగింత

పెద్దాపురం/సామర్లకోట), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాయభూపాలపట్నం గ్రామంలో శిథిలమైన వంతెన మీదుగా కెటికె కంపెనీ నుంచి భారీలారీల రాకపోకలను మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. అసలే ఇరుకుగా ఉన్న వంతెన సుమారు 100 ఏళ్ల పైబడి నిర్మించినది కావడం వల్ల భారీ లారీలను నడుపరాదని గతంలో కంపెనీకి హెచ్చరించినా ఎటువంటి ఫలితం లేకపోయిందని గ్రామస్తులు పెద్దాపురం ఆర్‌అండ్‌బీ అధికారులు, పెద్దాపురం పోలీసులకు తెలిపారు. పెద్దఎత్తున వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్దాపురం పోలీసులుఇరువర్గాలతో చర్చలు ప్రారంభించారు.



గ్రామంలో నిలిచిపోయిన భారీ లారీలు

'సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం'

కిర్లంపూడి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు శృంగరాయునిపాలెం సర్పంచ్ పట్టు చంటిబాబు, మాజీ సర్పంచ్ గొడే బాల అన్నారు. కిర్లంపూడిలో రోడ్లను ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, ఎంపీటీసీ గరగా గోవిం దు, కరణం బూరయ్య అల్లుమల్ల వెంకన్న, జనసేన నేతలు వీసం బాబ్జి, సంతోష్ పరిశీలించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

టెన్త్, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలో జరిగే టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేదుకు చర్యలు చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, డివిజనల్ ఫారెస్ట్ అధికారి రవీంద్రలతో కలిసి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్జేడీలు నాగమణి, నరసింహమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి బి.బ్రహ్మాజీరావు, డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యువోలు మోహన్‌కృష్ణ, రామతులసి, సుజాత, ఎంఈవోలు రామకృష్ణ, తాతబ్బాయి, బాపిరాజు, సూరారెడ్డి పాల్గొన్నారు.

రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. రంప గ్రామంలో 45 మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు బొర్ర నాగరాజు, ఎస్.గంగరాజు, జి.గౌరీశంకర్, సూర్యారావు, ప్రసాద్‌నాయుడు, మర్ల మణి, లోహితస్, కళాశాల ప్రిన్సిపాల్ కె.వసుధ, డాక్టర్ ఎం.స్పందన పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎఫ్‌వో రవీంద్ర ధామలతో కలిసి కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆధార్ అనుసంధానంతో రైతులు ఐడీని అప్లోడ్ చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి నందు, హార్టికల్చర్ అధికారి ఎ.రమేష్‌కుమార్, జిల్లా నేచురల్ ఫామింగ్ అధికారి ఎల్.భాస్కరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహం, డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, పీహెచ్‌వో చిట్టిబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.సావిత్రి, ఏపీడీ జి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. గిరిజన ప్రాంతానికి అనువైన మొక్కలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాటి బెల్లం తయారీ, రైతులకు పంపిణీ చేసే మేక, కోడి పిల్లల పెంపకం కేంద్రాన్ని పరిశీలించారు. శాస్త్రవేత్తలు రాజేంద్రప్రసాద్, వీరాంజనేయులు, క్రాంతికుమార్, ప్రవీణ్‌బాబు, వెంగయ్య, పీహెచ్‌వో కె.చిట్టిబాబు పాల్గొన్నారు.

నేడు 'పోలవరం'పై సమీక్ష

హాజరుకానున్న అల్లూరి జిల్లా కలెక్టర్

చింతూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ముంపు, పరిహారం తదితర అంశాలపై బుధవారం చింతూరు ఐటీడీఏ సమావేశ మందిరంలో సమీక్ష జరగ నుంది. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వం వహించనున్నారు. దీంతో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు రంపచోడవరం పరిపాలనా అధికారి వి అభిషేక్ చింతూరు డివిజను అధికారు లను అప్రమత్తం చేశారు.



పోలవరం నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పోలవరం పునరావాస కాలనీని పరిశీలించిన కలెక్టర్

దేవీపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమొదలు పంచాయతీ పెద్దభీంపల్లి-3, తాళ్ళూరు పునరావాస కాలనీలను అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ మంగళవారం సందర్శించారు. నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులు మాట్లాడుతూ తమ గ్రామంలో గతంలో అధికారులు సర్వేలు నిర్వహించారన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు కటాఫ్ డేట్ నిండినప్పటికీ అర్హులుగా గుర్తించలేదన్నారు. భూమికి సంబంధించి నష్టపరిహారం, భూమికి భూమి సమస్యలు ఉన్నాయని, తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేసినప్పటికీ సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, కాలనీలో ఇళ్లను నాణ్యతాలోపంతో నిర్మించారని, కోర్టును ఆశ్రయించినా తమ సమస్యలను అధికారులు పరిష్కరించట్లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్వయంగా ఇంటి స్లాబ్ పైకి ఎక్కి నాణ్యతపై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు.

మట్టి అక్రమ తరలింపు యత్నం అడ్డగింత

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం గ్రామ శివారు తెల్లకొండ అటవీ ప్రాంతంలో ఆర్‌వైఎఫ్‌ఆర్ పట్టా కలిగిన గిరిజన రైతు భూమి నుంచి జాతీయ రహదారి 516(ఇ) పనుల నిమిత్తం అక్రమంగా మట్టి తరలిస్తున్నట్టు సమాచారం అందింది. దీంతో అటవీ సిబ్బంది ఆ ప్రదేశానికి వెళ్లారు. ఎక్స్‌కవేటర్‌తో రెండు టిప్పర్లలో మట్టి లోడ్ చేస్తుండగా సిబ్బందికి వెళ్లేసరికి డ్రైవర్లు పరారైనట్లు రాజవొమ్మంగి ఫారెస్టు రేంజ్ అధికారి ఉషారాణి తెలిపారు. టిప్పర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు తాళాలతో ఉడాయించడంతో వాటి వద్ద సిబ్బందిని కాపలాగా ఉంచి ఒక్క లారీని మాత్రమే రాజవొమ్మంగి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. కొండపోడు పట్టా కలిగిన రైతు పాంగి జాంబ్రి అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపడతామన్నారు.



మట్టి తవ్వేందుకు ఉన్న ఎక్స్‌కవేటర్, పక్కనే లారీలు

మోతుగూడెంలో సింగర్ మధుప్రియ

మోతుగూడెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని పొల్లూరు జలపాతం వద్ద ఒక ప్రైవేట్ సాంగ్ చిత్రీకరణకు సింగర్ మధుప్రియ మంగళవారం వచ్చారు. ఆమె మోతుగూడెంలోని ఓ టీ స్టాల్ వద్ద ఆగగా చూడ్డానికి అభిమానులు వచ్చారు. కొంతమంది సెల్ఫీలు దిగారు. మధుప్రియ అక్కడి నుంచి మారేడుమిల్లి వెళ్లారు.



సింగర్ మధుప్రియతో సెల్ఫీ దిగిన దృశ్యం

మహిళలు లీడర్‌షిప్ సాధించాలి

చింతూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు లీడర్‌షిప్ సాధించాలని ఎస్‌ఐ పి.రమేష్ కోరారు. మంగళవారం సొఫిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కో-ఆర్డినేటర్ అహ్మద్ అలీ, చింతూరు ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ వెంకటరమణ, ఎస్‌బీఐ మేనేజర్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు లీడర్‌షిప్ సాధించాలన్న అంశంపై మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల ప్రారంభం



ప్రత్తిపాడు: ధర్మవరంలో తరగతులను ప్రారంభిస్తున్న అధికారులు, శంఖవరం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో, కిర్లంపూడిలో వివరిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6రోజులు పాటు డిపార్టుమెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఉమెన్ డెవలప్‌మెంట్, చైల్డ్ వెల్ఫేర్, సమగ్రశిక్ష స్టేట్ కౌన్సిల్ ఆఫ్‌ఎడ్యుకేషన్ రీసెర్చ్‌లు సంయుక్తంగా నిర్వహించే జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను మంగళవారం ఎంపీడీవో ఎంవీఆర్‌కుమార్‌బాబు, ఎంఈవో వి.రాజబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరలక్ష్మి ప్రారంభించారు. 81అంగన్‌వాడీ కేంద్రాల టీచర్‌లు పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం లక్ష్యమని, రాష్ట్రవ్యాప్తంగా మండలస్థాయిలో ఎంపిక చేసిన 1344 ఉన్నత పాఠశాలల్లో తరగతులు నిర్వహించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. కిర్లంపూడి ఎంఈవో టి.జోసెఫ్, ఎం.చిన్నారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీవో ఎం.పూర్ణిమ విచ్చేశారు. సుమారు 85మంది అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. 120 రోజులపాటు శిక్షణ జరుగుతుందని ఆమె తెలిపారు. హైస్కూల్ ఉపాధ్యాయుడు ప్రకాశ్, డీఆర్పీలు జయశ్రీ, వరలక్ష్మి, సాయికృష్ణ తర్ఫీదునిస్తారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.బూసమ్మ, ఎస్.కర్రిమునీషా, ప్రధానోపాధ్యాయుడు సాయికృష్ణ పాల్గొన్నారు.

శంఖవరం: చిన్నవయస్సులోనే చిన్నారులకు నైపుణ్యాభివృద్ధి చేసుకునేలా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించుకుందని వాటి కోసం కొన్ని సంస్కరణలు తీసుకొస్తున్నట్లు ఎంఈవో ఎస్వీ రమణ తెలిపారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా కత్తిపూడి ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 120 రోజుల పాటూ ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అరుణశ్రీ, రజనీ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: రౌతులపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహించగా ఎంఈవో ఎల్.శ్రీనివాస్ ప్రారంభించారు. ట్రైనర్ డి.మోహన్ శిక్షణ ఇచ్చారు. ప్రీస్కూల్స్ బలోపేతం చేయడానికి 3 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

కోటనందూరు: కోటనందూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జ్ఞానజ్యోతి శిక్షణలో ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడారు. అంగన్‌వాడీలను ప్రీస్కూల్స్‌గా మారుస్తుండడంతో టీచర్లకు శిక్షణ ఇచ్చి తగు చర్యలు చేపట్టామన్నారు. మండలంలోని 51 అంగన్‌వాడీ టీచర్లకు అన్నిరకాలుగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో 2 రామశేఖర్, రిసోర్స్‌పర్సన్‌లు కె.అచ్చినాయుడు, ఎ.సత్యనారాయణ, ఎస్.శ్రీను, కెనాగభూషణం, సీఆర్పీ యర్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలి

టీడీపీ నాయకుల ప్రచారం



ప్రత్తిపాడు: రాచపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు



ఏలేశ్వరంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి, ధర్మవరం గ్రామాలలో మంగళవారం ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు నూకరాజు, అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు బుద్ధరాజు గోపిరాజు, దాట్ల అప్పన్నబాబు, బొల్ల కొండబాబు, మంతెన శ్రీను, గొంతిన సురేష్, బొల్ల వెంకటేశ్వరరావు, దాట్ల కృష్ణబాబు ఓటర్లను కలిసి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బతుకుల భాస్కర్, యర్రాబత్తుల గోవిందనాయుడు, చక్రి, సారిపల్లి లోకేష్ తదితరులున్నారు.

ఏలేశ్వరం: కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రత్తిపాడు పరిశీలకుడు గంటా నూకరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న పట్టభద్రులను కూటమి నాయకులు కలిసి రాజశేఖర్‌కు ఓటు వేసేలా కోరాలన్నారు. నరర పంచాయతీ పరిధిలో ఓటర్లను కలిసి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జనసేన నాయకులు పెంటకోట మో హన్, టీడీపీ నాయకులు పరవాడ రమేష్, సామంతుల గోపి, కోరాడ కృష్ణ మోహన్, శిడగం బాలు, సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం: కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా అన్నవరంలో టీడీపీ శ్రేణులు గ్రాడ్యుయేట్‌లను కలసి ప్రచారం నిర్వహించారు. రాజాల చిట్టిబాబు, బొమ్మిడి సత్తిబాబు, పసుపులేటి చక్రి, మద్దు వీరబాబు ఉన్నారు.

మృతదేహంతో ఆందోళన



యర్రవరం గ్రామంలో నిరసన తెలుపుతున్న బంధువులు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరం గ్రామంలో అవంతి ఫ్యాక్టరీ వద్ద మంగళవారం పెద్దనాపల్లి గ్రామస్తులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన మోర్ల సుదర్శన్‌రావు(21) గతేడాది డిసెంబర్ 31న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోమవారం రాత్రి మృతి చెందాడు. సుదర్శనరావు మృతికి కంపెనీ బాధ్యత వహించాలని గేటు వద్ద బంధువులు బైఠాయించారు. కంపెనీ పని మీద సుదర్శన్‌రావు వెళ్లాడని, అందువల్ల ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీపై ఉందని నినాదాలు చేశారు. సుదర్శనరావుకు భార్య స్రవంతి, 3 నెలల బాబు ఉన్నారని వారికి దిక్కెవరని ఆందోళనకారులు ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఏలేశ్వరం ఎస్‌ఐ రామలింగేశ్వరరావు వచ్చి బందోబస్తు ఏర్పాటు చేశారు. సుదర్శనరావు కంపెనీ పనిమీద ఎక్కడికీ వెళ్లలేదని, ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లి వస్తూ గాయాలకు గురయ్యాడని యాజమాన్యం అంటుంది.



ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య

క్షయ వ్యాధి నివారణ సులభతరం

ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సౌమ్య

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణ సులభతరమని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య, జిల్లా టీబీ సీనియర్ అధికారి డాక్టర్ అనీల్‌కుమార్ చెప్పారు. ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి వద్ద మంగళవారం టీబీ నివారణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య, అనీల్‌కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు ఆధునిక వైద్యం అం దుబాటులోకి వచ్చిందని, దీని వల్ల వ్యాధి నివారణ సులభతరమైందని, క్షయవ్యాధికి ఆందోళన గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఆసుపత్రుల పరిధిలోని 2.60లక్షల మంది ప్రజలకు టీబీ టెస్టులు చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. ఈ సమావేశంలో టీబీ ఏ విధంగా సోకుతుంది, దాని వ్యాప్తి, నివారణ చర్యలు వివరించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు

'ఉత్తమ ఫలితాలు సాధించాలి'

చింతూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అల్లూరి జిల్లా అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ స్వామి నాయుడు కోరారు. మంగళవారం ఆయన కస్తూర్బా పాఠశాలను సందర్శిం చారు. విద్యార్థినులను వసతులపై ఆరా తీశా రు. బోధన, బోధనేతర సిబ్బందికి పలుసూచనలిచ్చారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కనాటారు. ప్రత్యేక అధికారిణి రమాదేవి, ఉపాధ్యాయినిలు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిపాకలో పిచ్చికుక్క స్వైరవిహారం



గాయాన్ని చూపుతున్న రజిని

ఎటపాక, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపాక గ్రామంలో మంగళవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఆరుగురిని గాయపరిచింది. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రింగుసన్ని అనే బాలుడితో పాటు మందా రజిని, కనుకు బాబు, మరో ముగ్గురిపై దాడి చేసింది. వారికి అనేకచోట్ల గాయాలయ్యాయి. గ్రామస్తులు కుక్కను హతమార్చే ప్రయత్నం చేసినప్పటికీ పారిపోయింది.

గిరిజన మహిళకు సాయం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చికిలింత గ్రామానికి చెందిన జర్రా నూకరత్నం అన్నవాహిక వ్యాధితో బాధపడుతోంది. మంగళవారం ఆమెకు సర్పంచ్ కోండ్ల సూరిబాబు ఆధ్వర్యంలో గిరిజన సంఘ నాయకులు పి.సత్యనారాయణ, పి.రాంబాబు, పి.పాపారావు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వాహనాల తనిఖీ

మోతుగూడెం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో వై.రామవరం మండలం డొంకరాయితో పాటు రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది మంగళవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రతి వాహనాన్నీ ఆపి తనిఖీ చేశారు.

పవర్ ప్లాంట్లను రద్దు చేయాలి

అల్లూరి జిల్లా కలెక్టరుకు మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి ఫిర్యాదు

రంపచోడవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వైసీపీ ప్రభుత్వం గిరిజన చట్టాలకు భిన్నంగా మంజూరు చేసిన నాలుగు హైడల్ ప్రాజెక్టుల రద్దుకు సిఫార్సు చేయాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అల్లూరి జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్‌ను కోరారు. మంగళవారం రంపలో కలెక్టర్‌ను కలిశారు. అల్లూరి మన్యంలో పవర్ ప్రాజెక్టుల మంజూరుపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

మండల మహిళా సమాఖ్య సమావేశం

గండేపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గండేపల్లిలో మంగళవారం మండల మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. సమావేశంలో స్త్రీనిధి, ఉన్నతి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రికవరీ, స్త్రీనిధి, బ్యాంకు లోన్స్‌పై చర్చించారు. సమావేశంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కలవల రత్నం తదితరులు పాల్గొన్నారు.

'కనీసం వేతనం అమలు చేయాలి'



ఏలేశ్వరంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ మీటర్ రీడర్లు మంగళవారం నిరసన తెలిపారు. తమకు విద్యుత్ సంస్థల్లోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు నిరసన తెలిపినా మాకు న్యాయం జరగలేదని, కూట మి ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ఈనెల 20వన విజయవాడలో జరిగే రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కరపత్రాలను ఆవిష్కరించారు.

రౌతులపూడి(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ల రీడర్లకు కనీసం వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్ జగ్గంపేట డివిజన్ యూనియన్ అధ్యక్షుడు పసగడుగుల నానాజీ డిమాండ్ చేశారు. మా సమస్యలు పరిష్కరించకుంటే ఉపాధి కోల్పోతామన్నారు. సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 20న చలో విజయవాడ సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రౌతులపూడి సబ్‌స్టేషన్ నందు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌లో భాగంగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజనాల శ్రీను, సూరపు రెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, గోనశివ, అడబాల వీరబాబు, గంధం రమేష్, సలాది కనకరాజు,గనుకుల నాగార్జున, నాయకులున్నారు.

'ప్రభుత్వాలు వెనక్కి తగ్గాలి'

రౌతులపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కితగ్గకుంటే దేశంలో ఉన్న రాజకీయపార్టీలకు పతనం తప్పదని, రాక్స్ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ అన్నారు. రౌతులపూడిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ దేశవ్యాప్తంగా ఎస్సీల ఐక్యతపై జరుగున్న కుట్ర అన్నారు. కార్యక్రమంలో యాదగిరి సత్యప్రసాద్, మారే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

KCTB
ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లి.నెం.సి.750
సామర్లకోట బ్రాంచ్, సామర్లకోట. ఫోన్:0884-2327885
APPENDIX IV (Rule 8(1) స్థిరాస్థి కొరకు)

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ యన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 క్రింద ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్, సామర్లకోట బ్రాంచ్, సామర్లకోట యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 రూల్-2తో కలిపి చదవవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజుల లోపు నోటీసులో పేర్కొనబడిన రూ.12,92,931/-(అక్షరాల పన్నెండు లక్షల తొంభై రెండు వేల తొమ్మిది వందల ముప్పై ఒకటి మాత్రమే) ది.04-09-2023 నుండి వడ్డీతో తిరిగి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు.
1. **మూరా సత్యనారాయణ వర ప్రసాద్,** తండ్రి రాజులు, డోర్.నెం.7-117, గోకవరపు స్ట్రీట్, ప్రత్తిపాడు గ్రామం, ప్రత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా-533432. 2. మూరా అమ్మాలు భర్త సత్యనారాయణ వర ప్రసాద్ డోర్.నెం.7-117, గోకవరపు స్ట్రీట్, ప్రత్తిపాడు గ్రామం, ప్రత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా-533432, వారిని కోరుతూ ది.4-09-2023న డిమాండ్ నోటీసు జారి చేసినారు.

ఋణగ్రహీత సొమ్మును తిరిగి చెల్లించుటకు విఫలమైనందున ఋణగ్రహీతలకు హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది. ఏమనగా సదరు రూల్స్ యొక్క 8వ రూల్‌తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు తేది.15-02-2025న దిగువ వివరించిన ఆస్తిపై స్వాధీనం తీసుకున్నారు. సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **రూ.12,92,931/-** మొత్తానికి మరియు తేది.04-09-2023 నుండి వడ్డీ యితర ఖర్చులు ది.కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్, సామర్లకోట బ్రాంచ్, సామర్లకోట వారి చార్జీలకు లోబడి వుంటాయి.

స్థిరాస్థి వివరం

డాక్యుమెంట్ నెం.64/2009, ప్రత్తిపాడు SRO, తేది 12-01-2009 పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు SRO, ప్రత్తిపాడు గ్రామ పంచాయితీ, ప్రత్తిపాడు గ్రామం, రామాలయం వద్ద, గోకవరపు వారి వీధి సర్వే నెం.327/2 గల 260 చ॥గ॥ లేక 218.4 చ॥మీ॥ స్థలములో డోర్ నెం.7-117 గల ఆర్.సి.సి. భవంతికి కొలతలు మరియు హద్దులు

తూర్పు	: 20'0' లేక 18.288 మీ॥	- మూరా వెంకటేష్ గారి ఇల్లు
పడమర	: 20'0' లేక 18.288 మీ॥	- కాళ్ళ పల్లయ్యగారి ఇల్లు మరియు స్థలం
ఉత్తరం	: 13'0' లేక 11.888 మీ॥	- రాజ వీధి
దక్షిణం	: 13'0' లేక 11.288 మీ॥	- సి.హెచ్. గణేశ్వరరావు గారి ఇల్లు మరియు స్థలం

తేది: 15.02.2025 అధీకృత అధికారి
స్థలం: కాకినాడ ది.కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు లిమిటెడ్.

KCTB
ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లి.నెం.సి.750
సామర్లకోట బ్రాంచ్, సామర్లకోట. ఫోన్:0884-2327885
APPENDIX IV (Rule 8(1) స్థిరాస్థి కొరకు)

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ యన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 క్రింద ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్, సామర్లకోట బ్రాంచ్, సామర్లకోట యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 రూల్-2తో కలిపి చదవవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజుల లోపు నోటీసులో పేర్కొనబడిన రూ.4,30,775/-(అక్షరాల నాలుగు లక్షల ముప్పై వేల ఏడువందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) ది.04-09-2023 నుండి వడ్డీతో తిరిగి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు.
1. **కొత్తపల్లి వీరబాబు,** తండ్రి వీర్రాజు, డోర్.నెం.6-17, రామాలయం వీధి, రామచంద్రాపురం, కిర్లంపూడి మండలం-533437. 2. కొత్తపల్లి వెంకటలక్ష్మి, భర్త వీరబాబు డోర్ నెం.6-17, రామాలయం వీధి, కిర్లంపూడి మండలం-533437 వారిని కోరుతూ ది.4-09-2023న డిమాండ్ నోటీసు జారి చేసినారు.

ఋణగ్రహీత సొమ్మును తిరిగి చెల్లించుటకు విఫలమైనందున ఋణగ్రహీతలకు హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది. ఏమనగా సదరు రూల్స్ యొక్క 8వ రూల్‌తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు తేది.15-02-2025న దిగువ వివరించిన ఆస్తిపై స్వాధీనం తీసుకున్నారు. సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **రూ.4,30,775/-** మొత్తానికి మరియు తేది.04-09-2023 నుండి వడ్డీ యితర ఖర్చులు ది.కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్, సామర్లకోట బ్రాంచ్, సామర్లకోట వారి చార్జీలకు లోబడి వుంటాయి.

స్థిరాస్థి వివరం

డాక్యుమెంట్ నెం.3672/2016, జగ్గంపేట SRO, తేది 13-10-2016 పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, జగ్గంపేట SRO, కిర్లంపూడి మండలం, రామచంద్రపురం గ్రామ పంచాయితీ, తామరాడ గ్రామం, సర్వే నెం. 171 రిజిష్టర్ డాక్యుమెంట్ ప్రకారం 309 చ॥గ॥ లేక 258.35 మీ॥ భుక్త కొలత ప్రకారం 276.73 చ॥గుల స్థలములో గల ఆర్.సి.సి. భవంతి డోర్ నెం.1-202నకు కొలతలు మరియు హద్దులు.

తూర్పు	: 35'7'	- సిసి రోడ్
పడమర	: 35'7'	- అడ్డూరి ఏసుదాసు గారి ఇల్లు
ఉత్తరం	: 70'0'	- కురుమల్ల రాంబాబు, గంధం సిద్దియ్య మరియు అడ్డూరి అంజనేయులు గారి స్థలం
దక్షిణం	: 70'0'	- గంధం సిద్దియ్య మరియు మానేపల్లి వీరబాబు గారి స్థలం

తేది: 15.02.2025 అధీకృత అధికారి
స్థలం: కాకినాడ ది.కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు లిమిటెడ్.